بِسۡمِ اللّٰہِ الرَّحۡمٰنِ الرَّحِیۡمِ    نَحۡمَدُہٗ وَنُصَلِّیۡ عَلٰی رَسُوۡلِہِ الۡکَرِیۡمِ    وَعَلٰی عَبۡدِہِ الۡمَسِیۡحِ الۡمَوۡعُوۡد

وَلَقَدۡ نَصَرَکُمُ اللّٰہُ بِبَدۡرٍ وَّاَنۡتُمۡ اَذِلَّۃٌ

# బదర్

(Telugu)వార పత్రిక ఖాదియాన్

Weekly BADAR Qadian

సంపుటి: 11    www.akhbarbadr.in    సంచిక: 22

సంపాదకులు: హాఫిజ్ సయ్యద్ రసూల్ నియాజ్,
ఉపసంపాదకులు: ముహమ్మద్ అక్బర్.

తేది: 28- మే 2026 క్రీ, శ. 28- హిజ్రత్ 1405 హి, శ. 10- జుల్ హజ్ 1447 హి,ఖ.

## పవిత్ర ఖుర్ఆన్ బోధనలు

لَنۡ یَّنَالَ اللّٰہَ لُحُوۡمُہَا وَلَا دِمَآؤُہَا وَلٰکِنۡ یَّنَالُہُ التَّقۡوٰی مِنۡکُمۡ ؕ کَذٰلِکَ سَخَّرَہَا
لَکُمۡ لِتُکَبِّرُوا اللّٰہَ عَلٰی مَا ہَدٰىکُمۡ ؕ وَبَشِّرِ الۡمُحۡسِنِیۡنَ ○ ﴿سُوۡرَۃُ الۡحَجِّ:38﴾

అనువాదం: అల్లాహ్ వరకు (బలి జంతువుల) మాంసము గాని, వాటి రక్తము గాని ఎన్నడు చేరుకోవు. కాని మీ నిష్టా అతని వరకు చేరుతుంది. మీకు అల్లాహ్ మార్గదర్శనము ప్రసాదించినందునలకు మీరు అతని గొప్ప దనమును కొనియాడవలెనని అతడు ఈ విధముగా వాటిని మీ ఆధీనములో చేసెను. మేలు చేయువారికి శుభవార్తను అందించుము. (హజ్ :38)

## ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ప్రవచనాలు:

## ఈదుల్ అజ్హా ప్రాధాన్యత మరియు ఖుర్బాని (బలి) యొక్క ప్రాముఖ్యత:

హజ్రత్ అనస్ రజి ఇలా ఉల్లేఖించారు: దైవ ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి మదీనాకు విచ్చేసిన తరువాత నుండి మదీనా ప్రజలు సంవత్సరానికి రెండు సార్లు ఉత్సావాలు జరుపుకునేవారు. అందుకు హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా అన్నారు: అల్లాహ్ తాలా మీ కొరకు ఆ రెండు రోజులకు బదులుగా ఉత్తమమైన మరొక రెండు రోజులను నిర్ధారించాడు. అనగా ఈదుల్ ఫితర్, ఈదుల్ అజ్హా.

(సునన్ అబూదావూద్, కితాబుస్వలాత్, బాబ్ స్వలాతుల్ ఈదైన్‌చ హదీస్ 1134)

హజ్రత్ జైద్ బిన్ అర్కమ్ రజి ఇలా ఉల్లేఖించారు: ఓ దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఈ ఖుర్బాని అంటే ఏమిటి? అని అనుచరులు అడిగారు. అందుకు హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం 'ఇది మీ తండ్రిగారైన ఇబ్రాహీం అలైహిస్సలాం గారి సాంప్రదాయం.' అని తెలిపారు. తద్వారా మాకు ఎలాంటి ప్రతిఫలం లభిస్తుంది?. అని మరల అనుచరులు విన్నవించుకున్నారు. అందుకు ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం 'ప్రతి వెంట్రుకకు బదులుగా పుణ్య ఫలం ' లభిస్తుంది అని తెలిపారు.

(సునన్ ఇబ్నే మాజా కితాబుల్ అజాహీ, హదీస్ 3127)

హజ్రత్ ఆయిషా రజి ఇలా ఉల్లేఖించారు: దైవ ప్రవక్త హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా తెలిపారు: అల్లాహ్ దృష్టిలో ఈదుల్ అజ్హా రోజున ఆదమ్ కుమారుల సత్కార్యములలో రక్తంను ప్రవహింప జేయడం (అనగా ఖుర్బాని ఇవ్వడం) కంటే గొప్ప సత్కార్యము మరొకటి లేదు. (సునన్ తిర్మిజి, కితాబుల్ అజాహీ, హదీస్ 1493, సునన్ ఇబ్నే మాజా, హదీస్ 3126)

## “ఖుర్బాని యొక్క వాస్తవ భావం మరియు నిష్టాపరత యొక్క స్ఫూర్తి.

(ఉపదేశములు: హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం)

హజ్రత్ అఖ్దస్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇలా తెలిపారు:

అల్లాహ్ తాలా ఇస్లామీయ ధర్మశాస్త్రములోని అతిముఖ్యమైన ఆదేశాల కొరకు ఉదాహరణలను నెలకొల్పినాడు. ఈ క్రమంలోనే మానవుడు తన శక్తి సామర్థ్యములన్నింటితో మరియు తాను సర్వసంతో దైవ మార్గంలో అంకితమైపోవాలని అతన్ని ఆదేశించడమైనది. అందుకే అట్టి స్థితి కొరకే ఈ బాహ్య త్యాగములను ఉదాహరణగా నిర్ధేశించడమైనది. కాని ఈ త్యాగమే ముఖ్యోద్ధేశం. ఈ విషయాన్నే అల్లాహ్ తాలా ఈ విధముగా తెల్పినాడు. లన్ య్యనాలల్లాహ లుహూముహా వలా దిమాహుహా వలాకిన్ యనాలుహుత్తఖ్వా మిన్‌కుం (హజ్:38) అనగా అల్లాహ్ తాలాకు మీ బలిజంతువు యొక్క మాంసం గాని, రక్తంగాని చేరదు....... అనగా అతని మార్గంలో మృతి చెందునంతగా అతనికి భయపడుతూ ఉండుము. మీరు మీ చేతులతో జంతువును బలి ఇచ్చినట్లుగానే మీరు కూడ దైవ మార్గంలో బలి ఇచ్చుకొనుము. ఎవరిలోనైన ఈ స్థాయికి తగ్గిన నిష్టాపరత ఉన్నచో అది అసంపూర్తిగా భావించబడును.

(చష్మయే మాఅరిఫత్, రూహాని ఖజాయిన్ సంపుటి 23, పేజి 99)

## బలిదానపు అసలు వాస్తవికత మరియు ధర్మనిష్టాపరత సందేశం:

لَنۡ یَّنَالَ اللّٰہَ لُحُوۡمُہَا وَلَا دِمَآؤُہَا وَلٰکِنۡ یَّنَالُہُ التَّقۡوٰی مِنۡکُمۡ ؕ کَذٰلِکَ سَخَّرَہَا
لَکُمۡ لِتُکَبِّرُوا اللّٰہَ عَلٰی مَا ہَدٰىکُمۡ ؕ وَبَشِّرِ الۡمُحۡسِنِیۡنَ ○ ﴿سُوۡرَۃُ الۡحَجِّ:38﴾

హజ్రత్ ముస్లేహ్ మౌవూద్ రజియల్లాహు తాలా అన్హు పై సూక్తిని విశ్లేషిస్తూ ఇలా పేర్కొన్నారు: బలిదానాల మాంసం లేదా రక్తం సర్వశక్తిమంతుడైన అల్లాహ్‌కు చేరుతుందన్నది బలిదానపు వాస్తవికత కాదని గుర్తుంచుకోండి. వాటి అసలు వాస్తవికత ఏమిటంటే తద్వారా తక్వా (దైవభీతి, ధార్మిక నిబద్ధత) ఏర్పడుతుంది. ఆ దైవభీతియే దేవునికి ప్రీతికరమైనది. నవూజుబిల్లాహ్ సర్వశక్తి మంతుడైన అల్లాహ్ హిందువు దేవతల వలే రక్తపిపాసి మరియు మాంసహారియా? ఇందుకే ఆయన జంతుబలిని ఆజ్ఞాపించాడా?, అట్టి ప్రాణత్యాగాన్ని సంతోషంగా స్వీకరిస్తాడా,? బలిదానం చేసే వారికే స్వర్గసూచన ఇస్తాడా? అని కొంతమంది అభ్యంతరం వ్యక్తం చేస్తూ ప్రశ్నిస్తుంటారు. అయితే ఈ వాక్యం ద్వారా అల్లాహ్ తాలా ఇచ్చిన సమాధానం ఏమిటంటే, బలిదానాల అసలు ఉద్దేశ్యం వాటి మాంసం లేదా రక్తం దేవుని వద్దకు చేరడమనే భావంలో లేదు. వాటి నిజమైన ఉద్దేశ్యం మనిషి హృదయంలో ధర్మనిష్టాపరత (తక్వా)ను ఉత్పత్తి చేయడం. ఆ ధర్మ నిష్టాపరతయే దేవునికి ప్రీతికరమైనది. కాబట్టి మేక, ఒంటె లేదా గోవును బలి ఇచ్చి, తాము దేవున్ని చేరుకున్నామని భావించే వారు పొరపడుతున్నట్లే. స్వయముగా ఒక జంతువును వధించి, స్వయముగా భుజించడంలో ఎలాంటి వాస్తవికత లేదని అల్లాహ్ స్పష్టంగా చెబుతున్నాడు. దాంతో దేవునికి ఏమి ప్రయోజనం?. ఇది ఒక వాస్తవాన్ని రూపకాల భాషలో వ్యక్తపరచడం మాత్రమే, నిజానికి ఈ చర్యలో చాలా గాఢమైన వాస్తవికత దాగి ఉంది. చిత్రకారులు పదే పదే చిత్రాలు గీస్తారు. కానీ, వారి ఉద్దేశ్యం కేవలం చిత్రాలు సృష్టించడం మాత్రమే కాదు, నిజానికి వాటి ద్వారా ప్రజలకు ముఖ్యమైన సందేశాలను అందిస్తుంటారు. ఉదాహరణకు, వారు కొన్నిసార్లు గొలుసును చిత్రీకరిస్తారు. అది జాతీయ ఐక్యతను సూచిస్తుంది. మరికొన్నిసార్లు ఉదయిస్తున్న సూర్యుడిని చూపిస్తారు. అది జాతీయ పురోగతిని సూచిస్తుంది. అదే విధముగా ఈ భౌతిక బలిదానం కూడా ఒక రూపకాల భాష. **(9వ పేజిలో చదవండి)**

### అహ్మదియ్యా వార్తలు

సయ్యద్నా హజ్రత్ అమీరుల్ మోమినీన్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ అయ్యదహుల్లాహ్ తాలా బినస్రిహిల్ అజీజ్ గారు అల్లాహ్ దయతో క్షేమంగా ఉన్నారు.

జమాఅత్ సభ్యులు హుజూరె అన్వర్ కొరకు ప్రత్యేముగా దుఆలు చేయగలరు. అల్లాహ్ తాలా హుజూర్ అన్వర్‌కు ఆరోగ్య వంతమైన, చురుకైన సుదీర్ఘ జీవితంను ప్రసాదించుగాక!. ఉన్నత ఆశయ సాధనాలను సమకూర్చు గాకా!,అనుక్షణం హుజూర్‌ను రక్షించుచూ దైవదూతలతో సహాయ, సహకారములు అందించుగాక! *(ఆమీన్).*

జమీల్ అహ్మద్ నాసిర్, ప్రింటర్ పబ్లిషర్ గారు ఫజ్లె ఉమర్ ప్రింటింగ్ ప్రెస్ ఖాదియాన్‌లో ముద్రించి అఖ్బారె బదర్ ఖాదియాన్ కార్యాలయము నుండి ప్రచురించిరి. ప్రోపరైటర్, నిగ్రాన్ బదర్ బోర్డ్ ఖాదియాన్

సంపాదకీయం: لا إله إلا الله محمد رسول الله

# ఖానా కాబా సందర్శన మరియు ఈదుల్ అజ్‌హా:

ఇస్లాం యొక్క నాలుగవ మూల స్తంభం హజ్. హజ్ యొక్క విధి మరియు దాని ఆచారాల విపులమైన వివరణ పవిత్ర ఖుర్‌ఆన్‌లో పేర్కొనబడింది. అలాగే హ.జ్రత్ మహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) స్వయంగా హజ్ ఆచరించి, తన సున్నత్ ద్వారా ముస్లిం సమాజానికి హజ్ ఆచారాలను అమలులోకి తీసుకువచ్చారు. సూరహ్ ఆల్-ఇమ్రాన్, 98వ సూక్తిలో అల్లాహ్ తఆలా ఇలా ప్రకటించాడు:

"అనుకూలమున్న వారందరు హజ్ యాత్ర చేసి, ఈ గృహానికి (కాబా) సందర్శించడం కర్తవ్యము."

సూరహ్ అల్-హజ్, 28వ సూక్తిలో అల్లాహ్ ఇలా తెలిపాడు.

"ప్రజలలో హజ్‌ను ప్రకటన చేయుము. వారు నీ వద్దకు కాలినడకనూ, దూరపు ప్రయాణపు అలసటతో, బక్కచిక్కిన ఒంటెలపై కూడా వస్తారు."

హజ్ ఆచారాలను వివరిస్తూ, అల్లాహ్ తఆలా సూరహ్ అల్-బఖరా,159వ సూక్తిలో ఇలా తెలిపాడు:

"నిశ్చయంగా సఫా మరియు మర్వా (రెండు పర్వతాలు) అల్లాహ్ సంకేతములు. కాబట్టి ఎవరైనా ఈ గృహానికి హజ్ చేయినా లేదా ఉమ్రా ఆచరించినా, ఆ రెండు కొండల మధ్య సంచరించడంలో ఎవరికి ఎటువంటి పాపము లేదు."

హజ్ ఆచారాల యొక్క విపులమైన వివరణ సూరహ్ అల్-బఖరా, 196 నుండి 201వ సూక్తుల వరకు కూడా ఉంది.

హజ్ యొక్క జ్ఞానం మరియు తాత్వికతను వివరిస్తూ, హ.జ్రత్ మిర్జా గులామ్ అహ్మద్, మసీహ్ మౌఊద్ (అలైహిస్సలాం) ఇలా పేర్కొన్నారు:

"ఒక ఆధ్యాత్మిక యాత్రికుడి చివరి స్థితి ఏమిటంటే, అతను లోక సంబంధిత కోరికలన్నింటినీ పూర్తిగా విడిచిపెట్టి, అల్లాహ్ ప్రేమ మరియు భక్తిలో మునిగిపోవలెను. నిజమైన ప్రేమికుడు మరియు భక్తుడు తన ప్రాణాన్ని, తన హృదయాన్ని త్యాగం చేస్తాడు. అల్లాహ్ గృహం చుట్టూ చేసే తవాఫ్ ఈ త్యాగానికి బాహ్య చిహ్నం. భూమిపై ఒక బైతుల్లాహ్ (కాన ఖాబా) ఉన్నట్లే, ఆకాశంలో కూడా ఒకటి ఉంది. ఒక వ్యక్తి ఆ ఆకాశ గృహం చుట్టూ తవాఫ్ చేయకపోతే, భూమిపై చేసే తవాఫ్ సంపూర్ణం కాదు. భూమిపై తవాఫ్ చేసే వ్యక్తి తన వస్త్రాలను తొలగించి ఒకే వస్త్రాన్ని ధరించుకుంటాడు; కానీ ఆకాశ గృహం చుట్టూ తవాఫ్ చేసే వ్యక్తి అల్లాహ్ కొరకు పూర్తిగా తనను తాను విడిచిపెట్టుకున్నాడు. తవాఫ్ అనేది అల్లాహ్ ప్రేమికుల గుర్తు. వారు తమ స్వంత సంకల్పమే లేనట్లుగా అల్లాహ్ చుట్టూ తిరుగుతారు. ఆయన కొరకు వారు తమను అర్పించుకుంటారు."

(బదర్ పత్రిక, 10 జనవరి 1907, పేజీ 15)

హజ్ చేయడానికి ఆర్థిక సామర్థ్యం, మంచి ఆరోగ్యం, మరియు ప్రయాణ మార్గంలో భద్రత ఉండటం అవసరమైన షరతులు. అంటే, ఇది కొన్ని షరతులకు లోబడి ఉన్న ఫర్జ్ (కర్తవ్యం). హ.జ్రత్ ముస్లేహ్ మౌఊద్ రజియల్లాహుతాలా అన్‌హు ఇలా పేర్కొన్నారు:

"ఆర్థిక ఇబ్బందులు, ప్రయాణ మార్గంలో భద్రతా లోపం, బలహీనత లేదా అనారోగ్యం కారణంగా హజ్ చేయలేని వ్యక్తి, ఈ అడ్డంకులు తొలగితే హజ్ చేస్తాననే సంకల్పం కలిగి ఉంటే, అతను హజ్ చేసినట్టే పరిగణించబడతాడు."

(అల్-ఫజల్, 4 మే 1922)

హ.జ్రత్ ముస్లేహ్ మౌఊద్ రజియల్లాహుతాలా అన్‌హు ఇలా పేర్కొన్నారు:

"నాలుగవ ఆజ్ఞ హజ్ గురించి. ఒక వ్యక్తికి ప్రయాణ ఖర్చులు భరించే సామర్థ్యం ఉంటే, మార్గంలో ఎటువంటి ప్రమాదం లేకపోతే, మరియు తన కుటుంబం, పిల్లల సంరక్షణకు ఏర్పాట్లు చేయగలిగితే, జీవితంలో ఒక్కసారి అయినా హజ్ చేయమని ఆజ్ఞ ఉంది."

(అల్-అజ్‌హార్ లి జవాతిల్-ఖమార్, పుట 24)

మరల ఇలా అన్నారు:

"అల్లాహ్ తఆలా ఎవరికైనా సామర్థ్యం ప్రసాదిస్తే, వారు హజ్ చేయాలి. దానికి అనేక షరతులు ఉన్నాయి. ఉదాహరణకు, తగినంత సంపద ఉండాలి, ప్రయాణ మార్గం సురక్షితంగా ఉండాలి. యాత్రికురాలు ఒక మహిళ అయితే, ఆమెతో పాటు ఆమె భర్త, కుమారుడు, మేనల్లుడు లేదా మరో ఇతర సన్నిహిత పురుష బంధువు ఉండాలి."

(అల్-అజ్‌హార్ లి జవాతిల్-ఖమార్, పుట 47)

6 హిజ్రీ సంవత్సరంలో, హ.జ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం హుదేబియా సమయంలో హజ్ చేయాలనే ఉద్దేశంతో బయలుదేరారు. అయితే, ప్రవక్త (స)ను హజ్ మరియు ఉమ్రా చేయకుండా ఆపివేశారు. అందువల్ల ప్రవక్త (స) హజ్ మరియు ఉమ్రా చేయకుండా శాంతి ఒప్పందం చేసుకున్నారు. ప్రవక్త (స) తనతో తీసుకువచ్చిన ఖుర్బానీ జంతువులను అక్కడే బలి ఇచ్చారు. వారి (స) ఆదర్శాన్ని అనుసరించి సహాబాలు కూడా తమ జంతువులను బలి ఇచ్చారు. హజ్ చేయకుండా అడ్డుకున్నప్పుడు, ప్రవక్త (స) బలవంతం చేయకుండా శాంతి మరియు భద్రత మార్గాన్ని ఎంచుకున్నారు. వారి (స) ఈ చర్య తరువాత గొప్ప విజయాలకు ద్వారాలు తెరిచింది.

**ఈదుల్-అజ్‌హా లేదా త్యాగ పండుగ:-**

ఈదుల్-అజ్‌హాను జుల్ హిజ్జా నెల 10వ తేదీన జరుపుకుంటారు. దీనిని త్యాగ పండుగ అని కూడా అంటారు. భారత ఉపఖండంలో దీనిని "పెద్ద పండుగా" అని కూడా పిలుస్తారు. ఈ పండుగ త్యాగ భావనను ప్రతిబింబిస్తుంది మరియు హ.జ్రత్ ఇబ్రాహీం అలైహిస్సలాం మరియు హ.జ్రత్ ఇస్మాయీల్ అలైహిస్సలాం చేసిన మహత్తర త్యాగాన్ని స్మరించుకుంటూ జరుపబడుతుంది. ప్రవక్త ఇబ్రాహీం (అ) ఒక కలలో తన కుమారుడు ఇస్మాయీల్ (అ)ను బలి ఇస్తున్నట్లు చూశారు. ఆ దైవిక దర్శనాన్ని నిజంగా నెరవేర్చడానికి బయలుదేరినప్పుడు, వారి విధేయుడైన కుమారుడు కూడా అందుకు పూర్తిగా సిద్ధంగా ఉన్నాడు. అప్పుడు అల్లాహ్ తఆలా వారి ఆ దర్శనాన్ని అప్పటికే నెరవేర్చినట్లు ప్రకటించాడు.

హ.జ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం వారి సాంప్రదాయం ప్రకారం, ఈదుల్ అజ్‌హా రోజున ఈద్ నమాజుకు ముందు ఏమీ తినేవారు కాదు. అయితే ఈదుల్-ఫితర్ రోజున నమాజుకు వెళ్లే ముందు కొంత ఆహారం తీసుకునే వారు. ఈదుల్ అజ్‌హా రోజున జంతువును బలి ఇచ్చిన తరువాత, దాని మాంసాన్ని భుజించేవారు. అలాగే పండుగ నమాజ్ చదివిన స్థలంలోనే జంతువులను బలి చేయడం కూడా వారి సాంప్రదాయం. వారు రెండు జంతువులను బలి ఇచ్చేవారు. ఒకటి తమ తరఫున మరియు మరొకటి తమ ఉమ్మత్ (సమాజం) తరఫున.

హ.జ్రత్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాం ఇలా పేర్కొన్నారు:

" హృదయాల పవిత్రతయే నిజమైన త్యాగం. మాంసం మరియు రక్తం అసలు త్యాగం కావు. సాధారణ ప్రజలు జంతువులను త్యాగం చేసే చోట, ప్రత్యేక వ్యక్తులు తమ హృదయాలను త్యాగం చేస్తారు. అయినప్పటికీ దేవుడు ఈ జంతు త్యాగాలను రద్దు చేయలేదు, ఎందుకంటే ఈ త్యాగాలకు కూడా మానవులతో సంబంధం ఉందని అర్థం కావాలి." (బరాహీన్-ఎ-అహ్మదీయ్యా, భాగం 5, రూహానీ ఖజాయిన్, సంపుటి 21, పేజీ 424)

హ.జ్రత్ ముస్లెహ్ మౌఊద్ రజియల్లాహు తాలా అన్‌హు ఈదుల్ అజ్‌హా సందర్భంగా స్వచ్ఛంద ఉపవాసం గురించి మాట్లాడుతూ ఇలా అన్నారు:

"హ.జ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం వారి సాంప్రదాయం ద్వారా నిరూపితమైనదేమనగా, వారు ఆరోగ్యంగా ఉన్నప్పుడు త్యాగం జరిగే వరకు ఉపవాసంగా ఉండి, అనంతరం దాని మాంసాన్ని భుజించేవారు. అయితే, ఇలా ఉపవాసం చేయకపోతే పాపం వస్తుందని కాదు. ఇది తప్పనిసరి కాదు; ఇది స్వచ్ఛందమైనది మరియు శ్రేయస్కరమైనది. చేయగలిగినవారు చేయవచ్చు. కానీ అనారోగ్యంతో ఉన్నవారు, వృద్ధులు లేదా ఇతర కారణాల వల్ల చేయలేని వారు బాధ్యతగా పాటించవల్సిన అవసరం లేదు మరియు చేయకపోయినా పాపం కాదు... నేను ఆరోగ్య పరిస్థితిలో హ.జ్రత్ మసీహ్ మౌద్ అలైహిస్సలాం గారిని కూడా ఇలా ఆచరించగా చూశాను."

(ఖుత్బాత్-ఎ-మహ్మూద్, సంపుటి 2, పేజీ 263)

బలి కోసం అనుకూలమైన జంతువుకు కొన్ని షరతులు ఉన్నాయి. అది ఎలాంటి లోపాలు లేకుండా ఉండాలి. కుంటిది కాకూడదు, అనారోగ్యంగా ఉండకూడదు, చెవి కోసి ఉండకూడదు లేదా కొమ్ము పూర్తిగా విరిగి ఉండకూడదు. మొత్తానికి అది ఆరోగ్యంగా ఉండాలి.

బలి చేసే సమయం ఈద్ నమాజ్ అనంతరం ప్రారంభమై మూడు రోజుల పాటు కొనసాగుతుంది. బలి మాంసాన్ని తాము కూడా భుజించవచ్చు. అలాగే బంధువులకు మరియు పేదలకు తప్పకుండా పంచిపెట్టవలెను.

హ.జ్రత్ ముస్లెహ్ మౌఊద్ (ర.అ) ఇలా పేర్కొన్నారు:

"బలి మాంసం గురించి ఇచ్చిన ఆదేశం ఏమిటంటే, బలి మాసం దానం క్రిందికి రాదు. ఆ మాంసాన్ని తాము తినవచ్చును, స్నేహితులకు ఇవ్వవచ్చును. అవసరమైతే కొంత నిల్వ చేసుకోవచ్చు కూడా. ధనవంతులు పేదలకు ఇవ్వాలి, పేదలు ధనవంతులకు ఇవ్వాలి. దీనివల్ల ప్రేమాభిమానాలు పెరుగుతాయి. కానీ కేవలం ధనవంతులకు మాత్రమే ఇవ్వడం ఇస్లాం ఆత్మను దెబ్బతీయడం వంటిది. అలాగే కేవలం పేదలకు మాత్రమే ఇచ్చి ధనవంతులకు ఇవ్వకపోవడం కూడా ఇస్లాంలో సరైన విధానం కాదు. ధనవంతులు పేదలకు, పేదలు ధనవంతులకు ఇవ్వడం ద్వారా పరస్పర ప్రేమ పెరుగుతుంది. మతం యొక్క ముఖ్య ఉద్దేశమైన ప్రేమను ఈ విధంగానే వ్యాప్తి చేయడం జరుగుతుంది."

(అల్-ఫజల్, 17 ఆగస్టు 1922)

ఇతరుల తరఫున కూడా బలి ఇవ్వవచ్చా? ఈ విషయమై హ.జ్రత్ ఖలీఫతుల్ మసీహుస్సాని (ర.అ) ఇలా పేర్కొన్నారు:

"చాలా మంది పేదవారు ఉంటారు. అందువల్ల ఎవరూ కూడ బలి ఇచ్చే సాంప్రదాయం నుండి ప్రతిఫలంను కోల్పోకూడదని ప్రవక్త మహ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) గారు తమ ఉమ్మత్ (సమాజం)లోని పేదవారి తరఫున ఒక బలిని సమర్పించేవారు. ఇది ప్రవక్త (స) సాంప్రదాయం. **(9వ పేజీలో చదువుము)**

# జుమా ప్రసంగము

**ఒకసారి, సంపూర్ణ మెలకువతో ఉన్నప్పుడు, నేను దైవ ప్రవక్తతో పాటు హసన్ (రజి), హుస్సేన్ (రజి), అలీ (రజి) మరియు ఫాతిమా (రజి)కలుసుకున్నాను. ఇది కల కాదు, కానీ నేను మెలకువతో ఉన్నప్పుడు అనుభవించిన విషయం. నేను ఈ విధంగా చాలా మంది పుణ్యాత్ములను కలుసుకున్నాను, కానీ ఆ సమావేశాలన్నింటినీ వర్ణించడానికి చాలా సమయం పడుతుంది. అంతేకాకుండా, ఎరుపు మరియు ఆకుపచ్చ స్తంభాల రూపంలో ఉన్న ఆధ్యాత్మిక కాంతి దర్శనాలు నాకు లభించాయి, వాటి సౌందర్యాన్ని మాటల్లో వర్ణించడం అసాధ్యం.**

**హుజూర్ (అ) ఇలా తెలిపారు: "నా యవ్వనం నుండి నాకు ఉపవాసం ఉండటం అలవాటు. నా యవ్వనంలో ఒకసారి నేను ఉపవాసం ఉండి అనారోగ్యానికి గురయ్యాను; అయినప్పటికీ, ఆ తర్వాత నేను ఎలాంటి ఇబ్బంది లేకుండా 29 ఉపవాసాలు పూర్తి చేశాను. అది నాకు నిజంగా ఆనందకరమైన ఈద్.**

**సయ్యద్నా అమీరుల్ మోమినీన్ హజ్రత్ మిర్జా మస్రూర్ అహ్మద్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ క్రీ.శ 13 ఫిబ్రవరి 2026 ( 13 తబ్లీఘ్ 1404 హి.శ) తేదిన మస్జిద్ ముబారక్ ఇస్లామాబాద్‌లో ప్రసంగించిన జుమా ఖుత్బా.**

أَشْهَدُ أَنْ لَّا إِلٰهَ إِلَّا اللّٰهُ وَحْدَهٗ لَا شَرِيكَ لَهٗ وَأَشْهَدُ أَنَّ مُحَمَّدًا عَبْدُهٗ وَرَسُوْلُهٗ

أَمَّا بَعْدُ فَأَعُوْذُ بِاللّٰهِ مِنَ الشَّيْطٰنِ الرَّجِيْمِ - بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ

اَلْحَمْدُ لِلّٰهِ رَبِّ الْعَالَمِيْنَ ۔ اَلرَّحْمٰنِ الرَّحِيْمِ ۔ مٰلِكِ يَوْمِ الدِّيْنِ ۔

اِيَّاكَ نَعْبُدُ وَاِيَّاكَ نَسْتَعِيْنُ ۔ اِهْدِنَا الصِّرَاطَ الْمُسْتَقِيْمَ ۔

صِرَاطَ الَّذِيْنَ اَنْعَمْتَ عَلَيْهِمْ غَيْرِ الْمَغْضُوْبِ عَلَيْهِمْ وَلَا الضَّآلِّيْنَ ۔

ఈ యుగంలో, ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం గారి ఆదర్శంపై అందరి కంటె ఎక్కువగా అనుసరించునట్టి దృశ్యాలు వారి నిజమైన శిష్యుడు హజ్రంత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం గారిలో కనిపిస్తుంటాయి. గత ప్రసంగాలలో, ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం వారి ఆరాధనకు, దానికి సంబంధించి వారు తన అనుచరులకు అందించిన మార్గదర్శకత్వానికి, మరియు అల్లాహ్‌ను ఆరాధించడానికి, స్మరించడానికి వారు బోధించిన పద్ధతులకు సంబంధించిన వివిధ వృత్తాంతాలు ప్రస్తావించబడ్డాయి.

ఈ రోజు, నేను హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం గారు తమ నాయకులైన ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంను అనుసరిస్తూ, ఆచరించిన, మరియు మనకు తెలియజేయబడిన వారి జీవితంలోని ఆ వృత్తాంతాలను వివరిస్తాను.

హజ్రత్ మిర్జా బషీర్ అహ్మద్ సాహిబ్ రజి ఇలా వివరిస్తున్నారు: గురుదాస్‌పూర్‌లోని లంగర్‌వాల్ నివాసి అయిన మిర్జా ముహమ్మద్ దీన్ సాహిబ్, వారికి ఇలా లేఖ రాశారు:

"నాకు బాల్యం నుండి హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాంను చూసే అవకాశం లభించింది. నేను వారిని మొట్టమొదటిసారిగా మిర్జా గులాం ముర్తజా సాహిబ్ జీవించి ఉన్న కాలంలో చూశాను. అప్పుడు నేను చాలా చిన్నపిల్లవాడిని.

హుజూర్ (అ) ఇషా నమాజ్ తర్వాత, త్వరగా నిద్రపోయేవారు. ఆ తర్వాత, సుమారు ఒంటి గంటకు మేల్కొని, తహజ్జుద్ నమాజ్ చేసేవారు. తహజ్జుద్ నమాజ్ చేసిన తర్వాత, వారు (అ) పవిత్ర ఖురాన్ పఠనంలో నిమగ్నమై ఉండేవారు. ఫజర్ నమాజ్ కోసం అజాన్ ఇచ్చినప్పుడు, వారు ఇంట్లో సున్నత్ నమాజ్ చేసి, ఆ తర్వాత ఫర్జ్ నమాజ్ కోసం మసీదుకు వెళ్లి సామూహిక నమాజ్ చేసేవారు. కొన్నిసార్లు, వారే స్వయంగా నమాజ్ చదివించేవారు. మరికొన్నిసార్లు, మసీదు ఇమామ్ అయిన మియాం జాన్ ముహమ్మద్ గారు చదివించేవారు. నమాజ్ నుండి తిరిగి వచ్చిన తర్వాత, వారు కొద్దిసేపు విశ్రాంతి తీసుకునేవారు. నేను ఎప్పుడూ "వారిని మసీదులో సున్నత్ నమాజులు చేయడం చూడలేదు. వారు సున్నత్‌లను ఇంట్లో చదివేవారు.

(సీరతుల్ మహ్దీ, సంపుటి 1, భాగం 3, కథనం 491, పేజీలు 513–514)

హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం తన ఆరాధన గురించి మాట్లాడుతూ, అల్లాహ్ తాలా తనకు ఆరాధనలో నిమగ్నమవ్వడానికి శక్తిని ఎలా ప్రసాదించాడో ఇలా వివరించారు. కాని మరల వారు ఇలా తెలిపారు: ఈ విధానంను అందరు ఆచరించాలని కాదు. ప్రతి ఒక్కరు తమ సామర్థ్యానికి మించి ప్రయత్నించకూడదు. ఎందుకనగా వారు (అ) ఇలా తెలిపారు. సర్వశక్తిమంతుడైన అల్లాహ్ నాకు ఒక ప్రత్యేకమైన శక్తిని ప్రసాదించాడు. మొత్తానికి వారు తమ ఆరాధనల రూపురేఖలను ఈ క్రింది విధముగా వివరించారు. వారు ఇలా పేర్కొన్నారు:

"నేను ఎన్నడూ కఠినమైన శారీరక ఆసనాలు వేయలేదు, లేదా కొంతమంది సమకాలీన సూఫీల వలె కఠోరమైన వ్యాయామాలు చేయలేదు, లేదా సంపూర్ణ ఆధ్యాత్మిక ఏకాంత వాసం చేపట్టలేదు. అంతేకాక, దైవ ప్రవక్త(స) ఆచరణకు విరుద్ధమైన, లేదా సర్వశక్తిమంతుడైన అల్లాహ్ ఆదేశాలకు అభ్యంతరకరమైన ఏ తపస్సును నేను చేయలేదు. నిజానికి, నేను ఫకీర్ల మరియు దురాచారములకు గురైన వారి పట్ల నేను ఎల్లప్పుడు విముఖతతోనే ఉన్నాను. వారు రకరకాల దురాచారాలలో మునిగిపోయారు."

మరల వారు (అ) ఇలా తెలిపారు: "అయితే, మా నాన్నగారి జీవితకాలంలో, ఆయన మరణం సమీపిస్తున్నప్పుడు, నాకు ఒకసారి కలలో ఒక మహోన్నతమైన, స్వచ్ఛమైన ముఖం గల ఒక పవిత్ర పురుషుడు కనిపించాడు. దివ్య కాంతులను ఆకర్షించడానికి కొన్ని రోజులు ఉపవాసం ఉండటం దైవ ప్రవక్త (స) కుటుంబం యొక్క సంప్రదాయమని ఆయన నాకు సూచించారు." అనగా అల్లాహ్ తాలా నుండి ఆధ్యాత్మిక కాంతిని పొందడం కోసం ఉపవాసాలు పాటించడం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) వారి కుటుంబం యొక్క సంప్రదాయం. సర్వశక్తి మంతుడైన అల్లాహ్, వారికి ఈ ప్రత్యేకమైన స్థానాన్ని ప్రసాదించబోతున్నట్లు వారికి ఒక కలలో ఈ విషయాన్ని సూచించాడు. మొత్తనికి మరల వారు ఇలా పేర్కొన్నారు: 'ఈ విధంగా, నేను కూడా ఈ సంప్రదాయాన్ని పాటించాలని ఆయన సూచించాడు. అందువల్ల, నేను కొంతకాలం ఉపవాసాలు పాటించడం సముచితమని భావించాను. కానీ, అదే సమయంలో, ఈ విషయాన్ని ఎవరికీ వెల్లడించకపోవడమే మంచిదని నాకు అనిపించింది. కాబట్టి, నేను నా భోజనాన్ని ఇంటిలోని మగవారి గదికి తెప్పించుకుని, నిర్దిష్ట సమయాల్లో రావాలని నేను ఏర్పాటు చేసుకున్న కొంతమంది అనాథలకు ఇచ్చేవాడిని. ఈ విధంగా, నేను రోజంతా ఉపవాసంతో గడిపేవాడిని. ఈ ఉపవాసాల గురించి దేవుడికి తప్ప మరెవరికీ తెలియదు. కొన్ని వారాల తర్వాత, నేను ప్రతిరోజూ కడుపు నిండా భోజనం చేస్తున్నప్పుడు ఉపవాసం ఉండటం నాకు కష్టమైన విషయమేమీ కాదని గ్రహించాను. అందువల్ల, నేను నా ఆహార పరిమాణాన్ని తగ్గించడం ప్రారంభించాలని నిర్ణయించుకున్నాను.' నేను క్రమంగా నా ఆహారాన్ని తగ్గించడం మొదలుపెట్టి, చివరికి రోజంతా, రాత్రంతా ఒకే రొట్టెతో సరిపెట్టుకున్నాను. 24 గంటల్లో ఒక్క రొట్టె ముక్కకు నా ఆహారాన్ని తగ్గించే వరకు, అదే పద్ధతిలో నా ఆహారపు అలవాట్లను తగ్గించుకుంటూ వచ్చాను. (ఆ 24 గంటల వ్యవధిలో, తినడానికి వారికి చాలా తక్కువ ఆహారం మాత్రమే ఉండేది.) నేను సుమారు ఎనిమిది లేదా తొమ్మిది నెలల పాటు దీనిని కొనసాగించాను. రెండు లేదా మూడు నెలల పసికందుకు కూడా సరిపోనంత అత్యల్ప పరిమాణంలో నేను ఆహారం తీసుకుంటున్నప్పటికీ, సర్వశక్తిమంతుడైన అల్లాహ్ నన్ను అన్ని రకాల దుష్ప్రభావాల నుండి, అనారోగ్యాల నుండి రక్షించాడు. నేను అనుభవించిన ఈ విధమైన ఉపవాసంలోని అద్భుతాలలో, ఆ సమయంలో నాకు ప్రసాదించబడిన సూక్ష్మ దర్శనాలు కూడా ఉన్నాయి. నేను కొందరు పూర్వ ప్రవక్తలను మరియు కొందరు ఉన్నత ముస్లిం ఔలియాలను, పుణ్యాత్ములను కలుసుకున్నాను. ఒకసారి, సంపూర్ణ మెలకువతో ఉన్నప్పుడు, నేను దైవ ప్రవక్తతో పాటు హసన్ (రజి), హుస్సేన్ (రజి), అలీ (రజి) మరియు ఫాతిమా (రజి)కలుసుకున్నాను. ఇది కల కాదు, కానీ నేను మెలకువతో ఉన్నప్పుడు అనుభవించిన విషయం. నేను ఈ విధంగా చాలా మంది పుణ్యాత్ములను కలుసుకున్నాను, కానీ ఆ సమావేశాలన్నింటినీ వర్ణించడానికి చాలా సమయం పడుతుంది. అంతేకాకుండా, ఎరుపు మరియు ఆకుపచ్చ స్తంభాల రూపంలో ఉన్న ఆధ్యాత్మిక కాంతి దర్శనాలు నాకు లభించాయి, వాటి సౌందర్యాన్ని మాటల్లో వర్ణించడం అసాధ్యం. ఈ కాంతి స్తంభాలు, వాటిలో కొన్ని తెల్లగా మరియు మరికొన్ని ఆకుపచ్చ మరియు ఎరుపు రంగులో ప్రకాశిస్తూ, నిటారుగా స్వర్గం వైపు లేచాయి, మరియు వాటిని చూడటం నా హృదయాన్ని ఆనందంతో నింపింది. ఈ స్తంభాలను చూసినప్పుడు నా హృదయం మరియు ఆత్మ అనుభవించిన ఆనందానికి ఏదీ సాటిరాదు. ఈ స్తంభాలు దేవునికి మరియు మానవునికి మధ్య ఉన్న ప్రేమకు ప్రతీక అని నేను నమ్ముతాను. హృదయం నుండి పైకి ప్రసరించే ఒక కాంతి, పై నుండి క్రిందికి దిగే మరొక కాంతి, ఆ రెండూ కలిసి ఒక స్తంభం ఆకారాన్ని సంతరించుకున్నాయి (అనగా, ఈ స్తంభాలు పైకి ఎగబాకుతూ, పై నుండి క్రిందికి దిగివచ్చి, చివరికి ఒక స్తంభం రూపంలో కలుస్తాయి). ఇవి ప్రపంచీకుల దృష్టికి అందని ఆధ్యాత్మిక విషయాలు. అవి ప్రపంచీకుల దృష్టికి చాలా దూరంగా ఉన్నందున, ప్రపంచీకులు వాటిని గుర్తించలేదు, కానీ ప్రపంచంలో కొందరికి వాటి గురించి అవగాహన కలుగుతుంది. సంక్షిప్తంగా చెప్పాలంటే, ఈ సుదీర్ఘ ఉపవాసం కారణంగా, వివిధ రకాల మరియు రూపాల దర్శనాల రూపంలో నాకు అద్భుతాలు వెల్లడయ్యాయి. అంతేకాకుండా, ఈ సుదీర్ఘ ఉపవాస సాధన వలన నేను పొందిన ఒక ప్రయోజనం ఏమిటంటే, ఈ క్రమశిక్షణకు నన్ను నేను లోబరచుకున్న తర్వాత, అవసరం ఏర్పడితే,

ఎక్కువ కాలం పాటు ఆకలి దప్పికలను తట్టుకోగల సామర్థ్యాన్ని నేను పొందాను. ఒకవేళ మల్లయోధుడు, ఒక స్థూలకాయుడు నాతో పాటు ఆకలితో ఉండాల్సి వస్తే, నాకు ఆహారం కోసం తీవ్రమైన అవసరం ఏర్పడక ముందే అతను చనిపోతాడని నేను తరచుగా అనుకుంటూ ఉంటాను. ఆకలితో అలమటించడంలో దశలవారీగా పురోగతి సాధించవచ్చని, అలాగే ఒకరి శరీరం అటువంటి లేమికి అలవాటుపడేంత వరకు, సుఖాన్వేషి అయిన వ్యక్తి ఆధ్యాత్మిక పురోగతి దశలను సాధించడానికి అర్హుడు కాదని ఈ అనుభవం నాకు నేర్పింది. కానీ, ప్రతిఒక్కరూ అటువంటి క్రమశిక్షణను చేపట్టాలని నేను సలహా ఇవ్వను, నేను కూడా నా స్వంత ఇష్టంతో అలా చేయలేదు. (ఆయన సర్వశక్తిమంతుడైన దేవుని ఆజ్ఞ మేరకు దానిని చేశారు.) కఠినమైన శారీరక క్రమశిక్షణను అవలంభించి, చివరికి తమ మానసిక స్థైర్యాన్ని కోల్పోయి (తమ మానసిక సామర్థ్యాలను కోల్పోయి) మిగిలిన జీవితాన్ని పిచ్చిలో గడిపిన లేదా క్షయ వంటి వివిధ వ్యాధులతో బాధపడిన అనేకమంది అజ్ఞానులైన దర్వేషులను నేను చూశాను."మానవులందరికీ ఒకే విధమైన మానసిక సామర్థ్యాలు ఉండవు. సహజంగా బలహీనమైన సామర్థ్యాలు ఉన్నవారు ఎలాంటి శారీరక క్రమశిక్షణను భరించలేరు. అతిత్వరలోనే, వారు ఏదో ఒక ప్రమాదకరమైన వ్యాధితో బాధ పడతారు." అయితే, ఇస్లాం ఒక సమగ్రమైన మతం. అంతేకాకుండా, దీనికోసం ప్రత్యేకంగా దైవిక సహాయం లభించింది. అందువల్ల, కేవలం తాను చేశాడన్న కారణంతో ప్రతి ఒక్కరూ దీనిని ప్రయత్నించకూడదని హుజూర్ (అ) పేర్కొన్నారు. మరల ఇలా పేర్కొన్నారు: "స్వయంగా కఠినమైన శారీరక క్రమశిక్షణకు లోనుకాకపోవడమే మేలు. దానికి బదులుగా, సామాన్య ప్రజల విశ్వాసాన్ని స్వీకరించాలి. (విశ్వాసం యొక్క సాధారణ బోధనలను స్వీకరించి, సున్నత్‌ను అనుసరించాలి.) అయితే, ఒకవేళ దేవుని నుండి దైవవాణి లభించి, అది ఇస్లాం యొక్క మహిమాన్వితమైన షరియాకు విరుద్ధంగా లేకపోతే, దానిని తప్పక పాటించాలి. కానీ, నేటి అవివేక ఫకీర్లు ఎలాంటి మంచి ఫలితాలనివ్వని క్రమశిక్షణలను బోధిస్తున్నారు. వారికి దూరంగా ఉండాలి."

(కితాబుల్-బరియ్యా, రుహానీ ఖజాయిన్, సంపుటి 13, పుటలు 196-200, ఫుట్‌నోట్)

ఇప్పటికీ, కొన్ని పద్ధతులను సూచించే కొందరు వ్యక్తులు ఉన్నారు, మరియు ఈ రోజుల్లో, అటువంటి భావనలు టెలివిజన్ కార్యక్రమాల ద్వారా కూడా ప్రచారం చేయబడుతున్నాయి. అయితే, అటువంటి స్వరాలకు ప్రభావితం కాకూడదు. అంతేకాక, ఒక విశ్వాసి మితవాద మార్గాన్ని అనుసరించాలి. దేవుడిచ్చిన తన సామర్థ్యపు పరిమితులలో, అల్లాహ్‌కు చెందవలసిన హక్కులను మరియు ఆయన సృష్టికి చెందవలసిన హక్కులను నెరవేర్చడానికి కృషి చేయాలి. కనీసంగా, దైవ ప్రవక్త(స) బోధించిన ఆరాధన ప్రమాణాలను మరియు పద్ధతులను సాధించడానికి ప్రయత్నించాలి, ఆపై అందులో క్రమంగా పురోగతి సాధించడానికి అన్వేషించాలి. ఆధ్యాత్మిక పురోగతి నిజానికి అంచెలంచెలుగా జరుగుతుంది. ఏదేమైనా, ఇస్లాం తనపై తాను అనవసరమైన కష్టాలను విధించుకోవడాన్ని నిషేధించింది. మరియు హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ)కూడా అటువంటి అతిక్రమణను నిరుత్సాహపరిచారు.

బాల్యం నుండే వారి (అ) ఆరోగ్య పరిస్థితికి సంబంధించి, మిస్త్రీ ఫకీర్ ముహమ్మద్ సాహిబ్ ఇలా వివరించినట్లు ఒక వృత్తాంతంలో పేర్కొనబడింది:

"నా తండ్రి పేరు జీవా, ఒక సందర్భంలో మిర్జా సాహిబ్ ఇంటి పైకప్పు నుండి కిందపడి తీవ్రంగా గాయపడ్డారని తెల్సింది. ఈ విషయం మాకు తెలిసిన వెంటనే, వారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకోవడానికి మేము వెళ్లాము. వారికి స్పృహ వచ్చినప్పుడు, ఆయన పలికిన మొట్టమొదటి మాటలు ఇవే: 'నమాజు సమయం వచ్చిందా, లేదా?' నమాజు పట్ల ఆయనకు అంతటి ప్రేమ ఉండేది. నా తండ్రి ఈ సంఘటనను వివరించిన సమయంలో, నేను ఇంకా చిన్న పిల్లవాడిని మాత్రమే."

(రిజిస్టర్ 'రవాయాత్ సహాబా' అప్రచురితం, సంపుటి 1, మిస్త్రీ ఫకీర్ ముహమ్మద్ తర్ఖాన్ ఖాదిరాబాద్ నుండి ఉల్లేఖన, పుట 58)

హజ్రత్ మిర్జా బషీర్ అహ్మద్ సాహిబ్ (ర.అ.) గారు, డాక్టర్ మీర్ ముహమ్మద్ ఇస్మాయిల్ సాహిబ్ (ర.అ.) గారి ఆధారముగా ఒక వృత్తాంతాన్ని కూడా నమోదు చేశారు. 1895వ సంవత్సరంలో, ఖాదియాన్‌లో రమజాన్ మాసం గడిపే అవకాశం తనకు లభించినప్పుడు, ఆ నెల మొత్తం తాను హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ.స.) గారి వెనుక నిలబడి తహజ్జుద్ (అంటే, తరావీహ్) నమాజు చేశానని ఆయన పేర్కొన్నారు. రాత్రి ప్రారంభ భాగంలో 'వితర్' నమాజు చేసి, ఆ తర్వాత రాత్రి చివరి భాగంలో, ఒక్కో విడతలో రెండు రకాతుల చొప్పున మొత్తం ఎనిమిది రకాతుల తహజ్జుద్ నమాజు చేయడం ఆయన ఆచరణగా ఉండేది. మొదటి రకాతులో ఆయన తప్పక 'ఆయత్ అల్-కుర్సీ'ని,"అల్లాహు లా ఇలాహ ఇల్లా హువ" నుండి "వ హువ అల్-అలియ్యుల్-అజీమ్" వరకు పఠించేవారు; రెండవ రకాతులో 'సూరా అల్-ఇఖ్లాస్'ను పఠించేవారు. ఆయన రుకూలో మరియు సజ్దాలో, ఈ విధంగా ప్రార్థించే వారు: యా హయ్యు యా ఖయ్యూమ్ బిరహ్మతిక నస్తఘీస్. ఓ సజీవుడా! ఓ స్వయం-స్థితుడా మరియు సర్వ-పోషకుడా అయిన అల్లాహ్! నీ కరుణను కోరుతూ నేను నీ సహాయాన్ని అర్థిస్తున్నాను. ఆయన పఠించే స్వరం నాకు వినిపించేంతగా ఉండేది, అది మృదువుగా, నెమ్మదిగా ఉండేది; మరీ బిగ్గరగా కాదు, అలాగని అస్సలు వినిపించనంత తక్కువగానూ కాదు. ఆయన ఎల్లప్పుడూ తహజ్జుద్ నమాజు పూర్తయిన తర్వాతే సెహ్రీని భుజించేవారు. తరచుగా ఆయన ఆ భోజనాన్ని ఎంత ఆలస్యం చేసేవారంటే, కొన్నిసార్లు ఆయన ఇంకా తింటూ ఉండగానే ఫజర్ నమాజు కోసం 'అజాన్' వినిపించేది. కొన్ని సందర్భాల్లో, అజాన్ పూర్తయ్యేంత వరకు కూడా ఆయన భోజనం కొనసాగించేవారు.

హజ్రత్ మిర్జా బషీర్ అహ్మద్ సాహిబ్ (ర.అ.) గారు దీనిపై మరింత వివరణ ఇస్తూ, సూత్రప్రాయంగా విషయం ఇదని తెలిపారు: తూర్పు దిక్కున కాంతి (వెలుతురు) కనిపించేంత వరకు సెహ్రీని భుజించడం అనుమతించబడుతుంది. అజాన్‌కు దీనితో ప్రత్యక్ష సంబంధం ఏమీ లేదు; వాస్తవానికి, అజాన్ సమయం అనేది ఆ కాంతి కనిపించడాన్ని బట్టి నిర్ణయించబడుతుంది. అందుకే, అజాన్ వినిపించగానే సెహ్రీ సమయం పూర్తిగా ముగిసిపోయినట్లేనని ప్రజలు తరచుగా భావిస్తుంటారు. ఆ తర్వాత ఆయన ఒక ఉదాహరణ ఇచ్చారు, ఖాదియాన్‌లో, ఫజర్ నమాజు కోసం అజాన్ తెల్లవారుజామున కనిపించిన వెంటనే ఇవ్వబడేది -- మరియు పొరపాటు లేదా అజాగ్రత్త వల్ల, అప్పుడప్పుడు అది కొంచెం ముందుగానే ఇవ్వబడే అవకాశం కూడా ఉండేది. అందువల్ల హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) కేవలం అజాన్ శబ్దానికి అనవసరమైన ప్రాముఖ్యతను ఇవ్వలేదు, కానీ తెల్లవారు జాము స్పష్టంగా కనిపించే వరకు భుజించేవారు. నిజానికి, ఈ విషయంలో షరియా యొక్క ఉద్దేశ్యం, ఖగోళ గణనల ద్వారా తెల్లవారుజాము సమయం నిర్ధారించబడిన క్షణంలోనే తినడం ఆపివేయాలని కాదు. దానికి బదులుగా, సాధారణ పరిశీలకునికి తెల్లవారు జాము యొక్క తెల్లదనం కనిపించినప్పుడు ఆపాలనేది దాని ఉద్దేశ్యం. ఖురాన్‌లోని 'తబయ్యున్' స్పష్టమైన ఆవిర్భావం అనే పదమే ఈ అవగాహనను సూచిస్తుంది. హదీసులో ఇలా కూడా ఉల్లేఖించబడింది, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ఆదేశించారు: "బిలాల్ అజాన్ ఇచ్చినప్పుడు మీ సెహ్రీని తినడం ఆపవద్దు, కానీ ఇబ్న్ ఉమ్మే మక్తూమ్ అజాన్ ఇచ్చే వరకు తినడం, త్రాగడం కొనసాగించండి," ఎందుకంటే అతను అంధుడు మరియు ప్రజలు నిజంగా తెల్లవారుజాము వచ్చిందని ప్రకటించే వరకు అజాన్ ఇచ్చేవాడు కాదు.

(సిరాత్-ఉల్-మహ్దీ, సంపుటి 1, భాగం 2, కథనం 320, పేజీలు 295-296)

అయితే, ఈ ప్రస్తుత యుగంలో, నిజమైన తెల్లవారుజాము యొక్క ఖచ్చితమైన సమయాన్ని నిర్ధారించే సాధనాలు చాలా అభివృద్ధి చెందాయి, మరియు ఇప్పుడు ఖచ్చితమైన పరికరాలు దానిని కచ్చితంగా లెక్కించడానికి వీలు కల్పిస్తున్నాయి. తత్ఫలితంగా, అజాన్ సమయాలు సాధారణంగా నిజమైన తెల్లవారుజాము కనిపించే అత్యంత ఖచ్చితమైన సమయానికి అనుగుణంగా ఖచ్చితంగా నిర్ణయించబడతాయి. అప్పుడప్పుడు జరిగే మానవ తప్పిదాలను పూర్తిగా తోసిపుచ్చలేనప్పటికీ, ఒకవేళ అజాన్ ముందుగా పిలిచినా, ఇంతకు ముందు చెప్పిన స్థాపిత సూత్రం అలాగే ఉంటుంది. రమజాన్ మాసం ప్రారంభమవుతున్నందున, నేను ఈ మార్గదర్శకత్వాన్ని వివరించాను. అదే సమయంలో, ప్రజలు భోజనం మానే ముందు పగటి వెలుగు స్పష్టంగా కనిపించే వరకు ఆలస్యం చేసేంతగా నిర్లక్ష్యంగా ఉండకూడదు. మన అజాన్ సమయాలు జాగ్రత్తగా లెక్కించి, తగిన పరిశీలనతో తయారు చేయబడ్డాయి. ఆ యుగంతో పోలిస్తే మన యుగంలోని గణన పద్ధతులు చాలా అభివృద్ధి చెందినవి కాబట్టి, పొరపాటు జరిగే అవకాశం చాలా తక్కువ. అందువల్ల, ప్రతి ఒక్కరూ అధికారికంగా తయారు చేసిన కాలపట్టికకు కట్టుబడి, తమ తమ ప్రాంతాలకు నిర్దేశించిన సమయాలకు అనుగుణంగా దానిని పాటించాలి.హజ్రత్ మిర్జా బషీర్ అహ్మద్ సాహిబ్ రజి ఉల్లేఖించిన దాని ప్రకారం, ముఫ్తీ ముహమ్మద్ సాదిఖ్ సాహిబ్ రజి ఇలా వివరించారు: "హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) కాలంలో, ఒకసారి వర్షం కోసం ప్రార్థన జరిగింది. ఆ ప్రార్థనలో హుజూర్ (అ)కూడా పాల్గొన్నారు, బహుశా దివంగత మౌల్వీ ముహమ్మద్ హసన్ సాహిబ్ ఇమామ్‌గా ఉండి ఉంటారు. ఆ ప్రార్థనలో ప్రజలు చాలా ఏడ్చారు, కానీ హుజూర్ (అ) గారి ఆత్మనిగ్రహం అసాధారణమైనది. అందువల్ల, వారు ఏడవడం నేను చూడలేదు. ఆ తర్వాత వెంటనే మేఘాలు కమ్ముకుని వర్షం కురిసినట్లు నాకు గుర్తుంది; బహుశా, అదే రోజు వర్షం కురిసి ఉండవచ్చు."

(సిరాత్-ఉల్-మహ్దీ, సంపుటి 1, భాగం 2, కథనం 435, పేజీ 393)

అయితే, దీనిని బట్టి హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) ప్రార్థనలో ఏడవలేదని ఎవరూ భావించకూడదు. వారు (అ) తర్వాత, వారిఆరాధనకు సంబంధించి కూడా కథనాలు ఉన్నాయి. వారు సజ్దాలో ఉన్నప్పుడు, ఆయన ఛాతీ నుండి కుండలో నీరు మరుగుతున్నట్లుగా శబ్దాలు వచ్చేవని ఆ కథనాలలో ఉంది. వారు తీవ్రమైన నొప్పి, వేదనతో సాష్టాంగ నమస్కారం చేస్తూ ఏడుస్తూ, వేడుకుంటూ ఉండేవాడు.

హజ్రత్ మిర్జా బషీర్ అహ్మద్ సాహిబ్ రజి, హజ్రత్ అమ్మా జాన్, నుస్రత్ జహాన్ బేగం సాహిబా (ర) నుండి ఒక ఉల్లేఖనాన్ని ప్రస్తావించారు: "మా అమ్మగారు చెప్పిన దాని ప్రకారం, ఐదు పూటల నమాజు కాకుండా, హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) గారు సాధారణంగా రెండు రకాల నఫిల్ నమాజులు చేసేవారు. అందులో ఒకటి ఇష్రాఖ్ నమాజు, ఇది రెండు లేదా నాలుగు రకాతుల నమాజు. దీనిని వారు అప్పుడప్పుడు చేసేవారు కానీ, క్రమం తప్పకుండా కాదు. రెండవది తహజ్జుద్ నమాజు, ఇది ఎనిమిది రకాతుల నమాజు; వారు (అ) తీవ్ర అనారోగ్యంతో ఉన్నప్పుడు తప్ప, దీనిని ఎల్లప్పుడూ చేసేవారు. అనారోగ్య పరిస్థితిలో కూడా, తహజ్జుద్

నమాజు సమయంలో వారు (అ) మంచం మీద పడుకుని ప్రార్థించేవారు. తన జీవిత చరమాంకంలో, బలహీనత కారణంగా, వారు సాధారణంగా తహజ్జుద్ నమాజును కూర్చుని చేసేవారు."

(సిరతుల్‌మహ్దీ, సంపుటి 1, భాగం 1, కథనం 3, పేజీ 4)

హజ్రత్ మౌల్వీ యాఖూబ్ అలీ సాహిబ్ రజి ఇలా వ్రాశారు: హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) గారు న్యాయపరమైన కేసుల నిమిత్తం ప్రయాణించినప్పుడు, వారు తన తండ్రి పట్ల విధేయత అనే విధిని నెరవేర్చడానికి వెళ్ళేవారు. అక్కడ, విచారణ జరుగుతున్నప్పుడు ఏ నమాజు కూడా తప్పిపోకుండా, లేదా ఏ నమాజును ఆలస్యంగా చేయకుండా వారు(అ) ఎంతో జాగ్రత్త వహించేవారు. అదేవిధంగా, సర్వశక్తిమంతుడైన అల్లాహ్ హక్కులకు సంబంధించిన బాధ్యతల విషయంలో కూడా వారు ఎన్నడూ అశ్రద్ధ వహించేవారు కాదు.

న్యాయస్థానాల ఆవరణలోనే, తనకు వేరే ఏ పనీ లేనట్లుగా, నిర్ణీత సమయంలో నమాజులో నిమగ్నమయ్యేవారు. మరియు తరచుగా, వారు నమాజులో నిమగ్నమై ఉండగా, అదే సమయంలో న్యాయస్థాన విచారణకు హాజరు కావాలని పిలుపు వచ్చేది. ఆయన వారు సంపూర్ణ మనశ్శాంతితో నమాజులోనే నిమగ్నమై ఉండే వారు. ఒక సందర్భంలో వారు ఇలా పేర్కొన్నారు, "నేను ఒక కేసు నిమిత్తం బటాలాకు వెళ్ళినప్పుడు ప్రార్థన సమయం ఆసన్నమై, నేను నమాజ్‌ను ప్రారంభించాను" అనగా, హుజూర్ (అ)నమాజ్ చేయడం ప్రారంభించారు. న్యాయస్థానంలోని పరిచారకుడు పిలిచాడు, కానీ నేను నమాజులో నిమగ్నమై ఉన్నాను. ఎదుటి పక్షం వారు హాజరై, ఏకపక్ష విచారణను తమకు అనుకూలంగా మలచుకోవాలని చూశారు. అవతలి పక్షం వారు హాజరు కాలేదు కాబట్టి, ఏకపక్ష తీర్పు ఇవ్వాలని వారు వాదించారు. వారు ఈ విషయాన్ని గట్టిగా నొక్కిచెప్పారు, కానీ న్యాయస్థానం వారి మాటలను పెడచెవిన పెట్టి, వారికి వ్యతిరేకంగా తీర్పు ఇచ్చి, నాకు అనుకూలంగా తీర్పునిచ్చింది. నేను నమాజు ముగించుకుని వెళ్ళినప్పుడు, బహుశా న్యాయమూర్తి నా గైర్హాజరును చట్టబద్ధంగా నమోదు చేసుకున్నారేమో అని అనుకున్నాను (ఎందుకంటే, ఒక పక్షం వారు హాజరు కాకపోతే, వారికి వ్యతిరేకంగా తీర్పు ఇవ్వవచ్చని చట్టం చెబుతుంది). కానీ నేను హాజరై, నమాజు చేసుకుంటున్నానని చెప్పినప్పుడు, ఆయన, 'నేను ఇప్పటికే మీకు అనుకూలంగా తీర్పు ఇచ్చాను' అని బదులిచ్చారు. (హయాతే అహ్మద్ సంపుటి 1, భాగం 1, పేజీ 87) ఇవి కూడా ఆరాధన యొక్క ఆశీర్వాదాలే, సర్వశక్తిమంతుడైన అల్లాహ్ ఈ విధంగా తన ఆశీర్వాదాలను ప్రసాదించాడు.

హజ్రత్ మిర్జా బషీర్ అహ్మద్ సాహిబ్ రజి, హజ్రత్ అమ్మా జాన్ (రజి)ను ఆధారం చేసుకొని మరొక కథనాన్ని వివరించారు. హుజూర్(అ) గారు ఇంట్లో మగ్రిబ్ నమాజు చదివించినప్పుడు వారు తరచుగా సూరా యూసుఫ్‌లోని ఈ వాక్యాన్ని పఠించేవారు. ఇన్నమా అష్కూ బస్సి వ హుజ్‌నీ ఇలల్లాహి. అనగా, నేను "నా దుఃఖాన్ని, వేదనను సర్వశక్తిమంతుడైన అల్లాహ్ ముందు మాత్రమే మొర పెట్టుకుంటాను."

హజ్రత్ మిర్జా బషీర్ అహ్మద్ సాహిబ్ రజి ఇలా అంటారు, "హుజూర్ (అ) స్వరంలో గొప్ప తీవ్రత, వేదన ఉండేవని, మరియు వారి పఠనం చాలా మధురంగా ఉండేదని నేను చెప్పాలి." (సిరాతుల్-మహ్దీ, సంపుటి 1, భాగం 1, కథనం 85, పేజీ 61)

అదేవిధంగా, మిర్జా ముహమ్మద్ దీన్ సాహిబ్ ఇలా పేర్కొన్నారు: హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) మసీదులో ఫర్జ్ నమాజులు చేసేవారు, అయితే వారు ఇంట్లో సున్నత్ మరియు నఫిల్ నమాజులు చేసేవారు. ఇషా నమాజు తర్వాత వారు నిద్రపోయేవారు, మరియు రాత్రి సగం గడిచిన తర్వాత, వారు మేల్కొని తహజ్జుద్ నమాజులు చేసేవారు. ఆ తర్వాత, వారు పవిత్ర ఖురాన్‌ను పఠించేవారు. వారు ఒక మట్టి దీపాన్ని వెలిగించి, ఫజర్ నమాజు అజాన్ వచ్చేవరకు ఖురాన్‌ను పఠిస్తూనే ఉండేవారు.

(అల్ ఫజల్ దిన పత్రిక ఖాదియాన్, 2 డిసెంబర్ 1941, పేజీ 3)

మరొక జీవితచరిత్రకారుడు ఇలా వ్రాశారు: వారికి పవిత్ర ఖురాన్ మరియు దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) సున్నత్ పట్ల ప్రగాఢమైన ప్రేమ మరియు భక్తి ఉండేవి. వారుచేసే ఆరాధనలన్నీ ఖురాన్ మరియు సున్నత్ పరిధిలోనే కచ్చితంగా ఉండేవి, వాటిని ఎన్నడూ అతిక్రమించలేదు. ఐదు పూటల నమాజులతో పాటు, వారు ప్రత్యేకంగా క్రమం తప్పకుండా తహజ్జుద్ నమాజు చేసేవారు. అప్పుడప్పుడు ఇష్రాఖ్ నమాజు కూడా చేసేవారు, అయినప్పటికీ వారికి తహజ్జుద్ నమాజు పట్లనే అసాధారణమైన ప్రేమ ఉండేది.

నమాజు సమయంలో, అల్లాహ్ స్మరణపై వారి ఏకాగ్రత మరియు దృష్టి ఎంత తీవ్రంగా ఉండేదంటే, వారు ఈ లోకంలో లేరేమో అనిపించేది. ముఖ్యంగా తహజ్జుద్ నమాజులో, వారు తీవ్రమైన వేదనతో మరియు తీవ్రమైన శ్రద్ధతో సూరా అల్-ఫాతిహాను పఠిస్తూ, విస్తారమైన ప్రార్థనలలో నిమగ్నమయ్యేవారు.

తన జీవితపు తొలిదశలో, అప్పుడప్పుడు ప్రార్థనలో పూర్తి ఏకాగ్రత కలగలేదని అనిపించినప్పుడు, వారు పదేపదే నమాజ్ చేస్తూ, "ఈ పద్ధతిని నేను ఒక తాగుబోతును చూసి నేర్చుకున్నాను" అని వ్యాఖ్యానించే వారు.

హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇలా తెలిపారు: ఒకసారి వారు నమాజ్‌లో సంపూర్ణ హృదయ ఏకాగ్రతను పొందలేకపోయినప్పుడు, మరింత ఏకాంతంలో నమాజ్ చేయడానికి అడవి వైపు బయలుదేరారు. మార్గమధ్యంలో, వారు ఒక సంత గుండా వెళుతుండగా, అక్కడ ఒక హిందూ వ్యక్తి తన సహచరునితో ఇలా అనడం విన్నారు: "నిన్న రాత్రి నేను ఒక పెగ్గు మద్యం తీసుకున్నాను, కానీ నాకు మత్తు రాలేదు. అందుకే రెండవ కప్పు తీసుకున్నాను; అది కూడా సరిపోనప్పుడు, మూడవది తీసుకున్నాను." ఈ విధంగా అతను చివరికి మత్తు వచ్చే వరకు త్రాగుతూనే ఉన్నాడు. ఇది విన్న తరువాత, వారు (అ) ఇలా ఆలోచించారని తెలిపారు: "నేను కూడా ఆధ్యాత్మిక మత్తును పొందే వరకు పదేపదే ప్రార్థనలు చేస్తూనే ఉంటాను." (డాక్టర్ బషారత్ అహ్మద్, ముజద్దిద్-ఎ-ఆజమ్, సంపుటి 1, అహ్మదీయ అంజుమన్ ఇషాత్-ఎ-ఇస్లాం, లాహోర్, పేజీ 26)

విధిగా చేయవలసిన నమాజ్‌లను ఈ విధంగా పునరావృతం చేయలేరు; బదులుగా, ఈ విషయంలో వారి దృష్టి ఐచ్ఛిక ప్రార్థనల వైపు ఉండేది. వారు ఐచ్ఛిక ప్రార్థనల గురించి ప్రస్తావిస్తూ, ఆశించిన "మత్తు" అంటే, నిజమైన హృదయ సాన్నిధ్యం పొందడం కోసం వాటిని పదే పదే చదివేవారని పేర్కొన్నారు.

నమాజ్ కాకుండా, వారు క్రమం తప్పకుండా పవిత్ర ఖురాన్‌ను పఠించేవారు, దైవ ప్రవక్తా (సల్లల్లాహు అలైహి వసల్లం) పై సలాం (దురూద్) పంపుతూ, క్షమాపణ (ఇస్తిగ్ఫార్) కోరేవారు. వారికి పవిత్ర ఖురాన్ పట్ల గాఢమైన, అపారమైన ప్రేమ ఉండేది. వారు పగలు, రాత్రి, కూర్చున్నప్పుడు, నిలబడినప్పుడు, లేదా నడుస్తున్నప్పుడు, ఖుర్‌ఆన్‌ను పఠించేవారు మరియు దాని పఠన సమయంలో విపరీతంగా ఏడ్చేవారు. ఇంతకు ముందు చెప్పినట్లుగా, ఏదైనా సందర్భంలో సామూహిక ప్రార్థన సమయంలో వారు ఏడవకుండా కనిపించినంత మాత్రాన, వారు అస్సలు ఏడ్చేవారు కాదని అర్థం కాదు. నిజానికి, పవిత్ర ఖురాన్‌ను పఠించేటప్పుడు, వారు తరచుగా తీవ్రమైన భావోద్వేగానికి, భక్తిభావానికి లోనయ్యేవారు. వారు (అ) లోతైన అవగాహనతో తరచుగా దురూద్ పఠించేవారు, మరియు వారు దానిని ఎంత తీవ్రతతో, వేదనతో పఠించేవారంటే, అది కన్నీళ్లతో, విలపనతో కూడి ఉండేది.

ఒక సందర్భంలో, ఇష్రాఖ్ ప్రార్థన గురించి ప్రస్తావిస్తూ, వారు (అ) తేనె యొక్క ప్రాముఖ్యత మరియు దానిలోని జ్ఞానాన్ని గురించి పేర్కొన్నారు, మరియు ఆ చర్చ ఆరాధన అనే అంశంపై ముగిసింది. మధుమేహం ఉన్నవారు తేనెను తినవచ్చా లేదా అనే విషయంపై చర్చ తలెత్తింది. ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా అన్నారు: "నేను మధుమేహంతో చాలా బాధపడ్డాను. ఈ పరిస్థితిలో తీపి పదార్థాలు అత్యంత హానికరం అని వైద్యులు చెబుతారు." మధుమేహంతో బాధపడుతున్న వారికి చక్కెరను తీసుకోవడం అత్యంత హానికరం. మరల ఇలా తెలిపారు: "ఈ రోజు, నేను దీని గురించి ఆలోచిస్తున్నప్పుడు నాకు ఒక ఆలోచన వచ్చింది. మార్కెట్లో లభించే వివిధ రకాల చక్కెర పదార్థాలు తరచుగా అనైతిక, పాపపు వ్యక్తులచే తయారు చేయబడతాయి, కాబట్టి అవి హానికరంగా ఉంటే ఆశ్చర్యం లేదు. కానీ తేనె దైవవాణి (వహీ) క్రింద తయారు చేయబడుతుంది. అందువల్ల, దాని గుణాలు ఖచ్చితంగా ఇతర తీపి పదార్థాల వలె ఉండవు. "ఒకవేళ అది వాటిలాగే ఉండి ఉంటే, అప్పుడు: షిఫావున్ లిన్నాసి అనగా ప్రజలకు స్వస్థత అని అన్ని తీపి పదార్థాల గురించి చెప్పబడి ఉండేది. అయితే, ఈ విషయంలో కేవలం తేనె గురించి మాత్రమే స్పష్టంగా ప్రస్తావించబడింది. కాబట్టి, ఈ వ్యత్యాసం దాని ప్రయోజనాలకు అనుకూలంగా ఉన్న ఒక వాదన. దాని తయారీ వహీ (వహీ) సాధనం ద్వారా నియంత్రించ బడుతుంది కాబట్టి, పువ్వుల నుండి మకరందాన్ని పీల్చే తేనెటీగ ఖచ్చితంగా ప్రయోజనకరమైన పదార్థాలను మాత్రమే గ్రహిస్తుంది. ఈ ఆలోచనను మనసులో పెట్టుకుని, నేను కొంచెం తేనెలో కొంత కెయోర్హా (ఒక రకమైన మొక్క) కలిపి త్రాగాను." ఆ తర్వాత కొద్దిసేపటికే, నా ఆరోగ్యం చాలా మెరుగుపడింది. నేను నడవగలిగేంతగా ముందుకు సాగి, ఇంట్లోని మగవారిని వెంటబెట్టుకుని తోటలోకి వెళ్లి 10 రకాతుల ఇష్రాఖ్ నమాజ్ చేశాను.

(మల్ఫూజాత్, 2022, సంపుటి 7, పుటలు 34-35)

ఒక సందర్భంలో అత్యంత తీవ్రమైన భూకంపం సంభవించిందని హజ్రత్ ముఫ్తీ ముహమ్మద్ సాదిఖ్ సాహిబ్ ఉదహరిస్తారు. భవనాలు, వస్తువులు తీవ్రంగా కంపించడం ప్రారంభించాయి, మరియు భయం, గందర గోళంతో నిండిపోయి ప్రజలు బాగా కలవరపడ్డారు. అటువంటి సమయంలో, అల్లాహ్ మసీహ్ (అ0 గారి స్థితి నిజంగా చూడదగినది. అసాధారణమైన ఆకాశ లేదా భూసంబంధమైన దృగ్విషయాలు సంభవించినప్పుడల్లా, ఆc హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ముఖంలో దైవభయం స్పష్టంగా వ్యక్తమయ్యేదని మనం హదీసులలో చదువుతాము. ఒక మేఘం కనిపించినా కూడా వారికి అశాంతి కలిగేది . వారు బయటకు వెళ్లి, ఆందోళనతో తిరిగి లోపలికి వచ్చేవారు. ఈ విధంగా, ఆ సమయంలో కూడా, దైవ ప్రవక్త ఈ పర్షియన్ పద్యం ......... అనగా "ఒక వ్యక్తికి దైవంపై గుర్తింపు ఎంత ఎక్కువగా ఉంటే, ఆయనకు అంత ఎక్కువగా భయం కలుగుతుంది." యొక్క సత్యాన్ని ఆచరణలో నిరూపించారు: మొత్తానికి భూకంపం ప్రారంభమైన వెంటనే, వారు (అ) తన కుటుంబ సభ్యులను, పిల్లలను పోగుచేసి సర్వశక్తిమంతుడైన అల్లాహ్ ముందు ప్రార్థనలో నిమగ్నమయ్యారు. వారు తన ప్రభువు ముందు సాష్టాంగ

నమస్కారం చేశాడు. చాలా సేపటి వరకు, ఆ కుటుంబమంతా, పరిచారకులతో సహా, సర్వశక్తిమంతుడైన అల్లాహ్ యొక్క గొప్పతనం మరియు స్వయం సమృద్ధి ముందు భయభక్తులతో వణికిపోతూ ప్రార్థనలోనే ఉండిపోయారు.

(జిక్ర్-ఎ-హబీబ్, పే. 102)

హజ్రత్ ముస్లేహ్-ఎ-మౌఊద్ రజి గారు సామూహిక నమాజు యొక్క ప్రాముఖ్యతను వివరిస్తూ ఒకసారి ఇలా తెలిపారు. పూర్వ కాలంలో, ప్రజలు తరచుగా మసీదులకు చాలా దూరంలో నివసించేవారు మరియు రవాణా సౌకర్యాలు పరిమితంగా ఉండేవి. దాని ఫలితంగా, కొందరు ఇంట్లోనే ఒంటరిగా నమాజు చేసుకునే అలవాటుకు లోనయ్యారు. అటువంటి పరిస్థితులలో నమాజులను విడిగా చేయకూడదని, వాటిని సామూహికంగా చేయాలని హజ్రత్ ముస్లేహ్ మౌఊద్ రజి ఉపదేశించారు.

మరల వారు ఇలా తెలిపారు:.సామూహిక నమాజును నెలకొల్పడానికి ఒక ఆచరణాత్మక పద్ధతి ఏమిటంటే, ఒకవేళ మసీదుకు వెళ్లలేని పక్షంలో, తన భార్యను, పిల్లలను ఇంట్లోనే పోగుచేసి వారికి నమాజు చేయించవలెను. దూరాల కారణంగా, వ్యక్తిగత నమాజు అలవాటు ఏర్పడింది, దాని ఫలితంగా ప్రజల హృదయాలలో సామూహిక నమాజు యొక్క ప్రాముఖ్యత తగ్గిపోయింది. ఇటువంటి ధోరణులనే మనం ఈ రోజు కూడా గమనిస్తున్నాము. అందువల్ల, ఈ అలవాటును విడిచిపెట్టి, సామూహిక నమాజు ఆచరణను నెలకొల్పాలి. నేడు కూడా, అటువంటి లోపాలు ఎక్కడైతే ఉన్నాయో, అక్కడ ఇంట్లో తమ పిల్లలతో కలిసి సామూహికంగా నమాజు చేయడంపై దృష్టి పెట్టాలి. ఇది పిల్లలలో క్రమమైన ప్రార్థన పట్ల అలవాటును మరియు ప్రేమను కూడా పెంపొందిస్తుంది.

మరల వారు హజ్రత్ మసీహ్ మౌఊద్ (అ) గారి ఉదాహరణను తెలిపారు. హుజూర్ (అ) నమాజ్ కోసం మసీదుకు వెళ్లలేనిప్పుడల్లా, ఇంట్లోనే సామూహికంగా నమాజ్ చేసేవారు. తప్పనిసరి అయిన అరుదైన సందర్భాలలో మాత్రమే వారు ఒంటరిగా నమాజ్ చేసేవారు. చాలా తరచుగా, వారు మా అమ్మను సామూహిక నమాజ్‌లో చేర్చుకునేవారు, మరియు ఇంటిలోని ఇతర స్త్రీలు అమ్మతో పాటు చేరేవారు. (బాజ్ ఎహమ్ ఔర్ జరూరీ ఉమూర్, అన్వర్-ఉల్-ఉలూమ్, సంపుటి 16, పుట 493)

హజ్రత్ సయ్యద్ జైన్-ఉల్-అబిదీన్ వలీవుల్లా షా సాహిబ్ రజి ఇలా వివరిస్తారు: "1935లో, నేను సియాల్‌కోట్‌కు ప్రయాణించాను. అక్కడ ఫజల్ దీన్ సాహిబ్ కుమార్తె మరియు హాఫిజ్ ముహమ్మద్ షఫీ' సాహిబ్ ఖారీ గారి గౌరవనీయమైన తల్లి అయిన మాయి హయత్ బీబీ అనే ఒక అత్యంత వృద్ధురాలిని కలుసుకునే అవకాశం నాకు లభించింది. ఆమెను కలుసుకునే అవకాశం మాకు దొరికింది; ఆమె తన ఇంటి గడప వద్ద కూర్చుని ఉన్నారు. మేము ఆమెను గుర్తుపట్టలేదు, కానీ ఆమె మమ్మల్ని గుర్తుపట్టారు. ఆమె మమ్మల్ని 'అస్సలాము అలైకుమ్' అని పలకరించి, 'దయచేసి ఇటు రండి' అని అన్నారు. ఆ సమయంలో, మాయి సాహిబా రజి గారి వయస్సు 105 సంవత్సరాలు." సిపాయిల తిరుగుబాటు రోజుల్లో, ఆ ప్రాంతంలో గందరగోళం నెలకొని ఉన్నప్పుడు (దీని ద్వారా ఆమె తన వయస్సును వివరించింది), ప్రభుత్వ కార్యాలయాలు మరియు న్యాయస్థానాలకు నిప్పు పెడుతున్నప్పుడు, తాను ఒక యువతిగా ఉన్నానని ఆమె వివరించింది. సంభాషణ సందర్భంగా, ఆమె ఇలా చెప్పింది: 'మిర్జా సాహిబ్ -- అంటే, హజ్రత్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాం సియాల్‌కోట్‌కు మొదటిసారి వచ్చి, తన ఉద్యోగ కాలంలో ఇక్కడ నివసించినప్పటి నుండి నాకు తెలుసు. ఆ సమయంలో, వారు చాలా పిన్న వయస్సు కలిగినవారు. వారి ముఖంపై గడ్డం యొక్క మొదటి ఆనవాళ్లు అప్పుడే కనిపించడం ప్రారంభించాయి; వారి గడ్డం ఇంకా పూర్తిగా పెరగలేదు. సియాల్‌కోట్‌కు వచ్చిన తర్వాత, హజ్రత్ మిర్జా సాహిబ్ తన తండ్రి ఇంటికి వచ్చి, వారిని పిలిచి, 'మియాఁ ఫజల్ దిన్ సాహిబ్, దయచేసి మీ రెండవ ఇంటిని నా నివాసం కోసం నాకు ఇవ్వండి' అని అన్నారని ఆమె వివరించింది. దానిని అద్దెకు తీసుకోవలసి ఉ ంది. మా నాన్న తలుపు తెరిచారు, మరియు వారు లోపలికి ప్రవేశించారు. మా నాన్నగారు నీళ్ళు, ఒక మంచం, ఒక నమాజ్ చాపను ఏర్పాటు చేశారు, మరియు మిర్జా సాహిబ్ గారి వస్తువులను కూడా అక్కడ ఉంచారు. ఆమె చెప్పిన దాని ప్రకారం, వారు సభ నుండి తిరిగి వచ్చినప్పుడల్లా, ముందుగా మా నాన్నగారిని పిలిచి, ఆ తర్వాత ఆయనతో పాటు నివాసానికి వెళ్ళేవారు. వారు ఎక్కువ సమయం మా నాన్నగారితోనే గడిపేవారు. వారి భోజనం కూడా మా ఇంట్లోనే వండేవారు, మరియు మా నాన్నగారే వారికి ఆహారాన్ని అందించేవారు. ఆ తర్వాత మిర్జా సాహిబ్ లోపలికి వెళ్లి తలుపు మూసుకుని, ఆవరణలో పవిత్ర ఖురాన్ పఠనంలో నిమగ్నమై ఉండేవారు. ఖురాన్ పఠిస్తున్నప్పుడు మిర్జా సాహిబ్ కొన్నిసార్లు సజ్దాలు చేస్తూ, నేల తడిసిపోయేంతగా కన్నీరు కార్చేవారని మా నాన్నగారు చెప్పేవారు. హజ్రత్ మసీహ్ మౌఊద్ (అ) గారి ఈ వృత్తాంతాలను వివరిస్తూ మాయి సాహిబా పదేపదే, 'వారి పవిత్ర నామం కోసం నేను బలిదానం అగుదును గాకా! అని అన్నారు. ఆమె ఈ సాక్ష్యాన్ని తన కుమారుని సమక్షంలో ఇచ్చారు.

(సీరత్-ఉల్-మహదీ, సంపుటం 1, భాగం 3, ఉల్లేఖన 625, పుటలు 594-595)

డాక్టర్ అల్లామా ఇక్బాల్ సాహిబ్ గారి గురువు అయిన మౌల్వీ మీర్ హసన్ సాహిబ్ ఆధారముగా హజ్రత్ షేక్ యాకూబ్ అలీ ఇర్ఫానీ సాహిబ్ ఒక ఉల్లేఖనను నమోదు చేశారు. దాని ప్రకారం, హజ్రత్ మసీహ్ మౌఊద్ (అ) గారు కాశ్మీరియాన్ వీధిలో, ఈ వినమ్రుని నివాసానికి సమీపంలో ఉన్న --- 'ఉమ్రా అనే ఒక కాశ్మీరీకి చెందిన ఇంట్లో అద్దెకు నివసించారు.వారు న్యాయస్థానం నుండి తిరిగి వచ్చినప్పుడు, పవిత్ర ఖురాన్ పఠనంలో నిమగ్నమయ్యేవారు -- కొన్నిసార్లు కూర్చుని, కొన్నిసార్లు నిలబడి, మరికొన్నిసార్లు నడుస్తూ పఠించేవారు. పఠించేటప్పుడు వారు కన్నీరుమున్నీరుగా ఏడ్చేవారు. వారు అంతటి భావోద్వేగంతో, భక్తిశ్రద్ధలతో పఠించేవారు, దానికి సాటి మరొకరు దొరకడం అరుదు. ఆ రోజుల్లో ప్రజలు తమ న్యాయపరమైన కేసులకు సంబంధించి తమకు అనుకూలమైన తీర్పులు వస్తాయనే ఆశతో, అభ్యర్థనలు మరియు సిఫార్సులతో అధికారులను సంప్రదించడం ఆనవాయితీగా ఉండేది. అనుకూలమైన పరిశీలన పొందడానికి న్యాయస్థాన అధికారుల వద్దకు రావడం ప్రజలకు అలవాటుగా ఉండేది. అదే విధంగా, ప్రజలు హజ్రత్ మసీహ్ మౌఊద్ (అ) వద్దకు వచ్చేవారు. 'ఉమ్రా' అనే ఇంటి యజమానికి ఫజల్ దిన్ సాహిబ్ అనే అన్నయ్య ఉండేవారు, ఆయన స్థానిక ప్రాంతంలో ఎంతో గౌరవనీయుడు. ఒక సందర్భంలో, దర్బారు వ్యవహారాల నిమిత్తం కొందరు తనతో పాటు కూర్చుని ఉండటాన్ని చూసి, హజ్రత్ మసీహ్ మౌఊద్ (అ) గారు మియాఁ ఫజల్ దిన్‌ను పిలిచి ఇలా అన్నారు: "దయచేసి ఈ ప్రజలకు ఇక్కడికి రాకూడదని వివరించండి. వారు తమ సమయాన్ని, నా సమయాన్ని వృథా చేస్తున్నారు. నేను వారి కోసం ఏమీ చేయలేను. నేను న్యాయాధికారిని కాను. నాకు సంబంధించిన విధులన్నీ నేను దర్బారులోనే నిర్వర్తిస్తాను." ఆ తర్వాత, మియాఁ ఫజల్ దిన్ అటువంటి సందర్శకులకు తదనుగుణంగా సలహా ఇచ్చి వారిని పంపించివేసేవారు. (హయాత్-ఎ-అహ్మద్, సంపుటి 1, భాగం 3, పేజీలు 370-371)

పాటియాలాకు చెందిన అహ్మదీయేతర గుమస్తా, మున్షీ 'అబ్దుల్ వాహిద్ సాహిబ్, హజ్రత్ మసీహ్ మౌఊద్ (అ) గారి పవిత్ర ఖురాన్ పఠనం గురించి వివరిస్తూ, 14 లేదా 15 సంవత్సరాల వయస్సులో, వారు రోజంతా ఖురాన్ చదువుతూ, పేజి చివరలో గమనికలు రాసుకుంటూ గడిపేవారని చెప్పారు.

(తారీఖ్-ఎ-అహ్మదీయత్, సంపుటి 1, పుట 64)

హజ్రత్ మసీహ్ మౌఊద్ (అ) గారి గురించి హజ్రత్ ముస్లేహ్-ఎ-మౌఊద్ రజి గారు ఇలా కూడా వ్రాశారు: హుజూర్ (అ) తన బాల్యంలో, తన తండ్రి జీవించి ఉన్న కాలంలోనే, లౌకిక జీవితం యొక్క విశ్వసనీయత లేని స్వభావానికి సంబంధించిన అటువంటి చేదు ఉదాహరణలను చూశారు, దానివల్ల హుజూర్ (అ) హృదయం ప్రపంచం నుండి విరక్తి చెందింది. హుజూర్ బాల్యం నుండే, తన ఆకాంక్షలన్నీ కేవలం అల్లాహ్ యొక్క ప్రీతిని పొందడం వైపే మళ్ళించబడ్డాయి.

హుజూర్ (అ) జీవిత చరిత్రను వ్రాస్తున్నప్పుడు, షేక్ యాకూబ్ అలీ ఇర్ఫానీ సాహిబ్ రజి హుజూర్ బాల్యంలో జరిగిన ఒక విశేషమైన సంఘటనను నమోదు చేశారు. వారు ఇంకా పసివయసులో ఉన్నప్పుడు, తన వయసున్న ఒక అమ్మాయితో , ఆమే తర్వాత వారిని వివాహం చేసుకున్నది. ఇలా అనేవారు. "ఓ ఆకాంక్షితురాలా, నాకు నమాజ్ చేసే సామర్థ్యాన్ని దేవుడు ప్రసాదించాలని ప్రార్థించు." వారి తొలిదశకు చెందిన ఈ చిన్న మాట, అప్పటికే వారి హృదయంలో కల్లోలం సృష్టిస్తున్న ప్రగాఢమైన ఆధ్యాత్మిక భావాలను వెల్లడిస్తుంది మరియు వారి కోరికలన్నీ పూర్తిగా కేవలం దేవుడిపైనే ఎలా కేంద్రీకృతమై ఉన్నాయో చూపిస్తుంది. ఇది వారికి చిన్నతనం నుండే ప్రసాదించబడిన తెలివితేటలను కూడా ప్రతిబింబిస్తుంది, ఎందుకంటే, ఈ మాటల ద్వారా, ఆ వయసులోనే, కోరికలన్నీ దేవుడి ద్వారానే నెరవేరతాయని మరియు ఆరాధించే సామర్థ్యం కూడా దేవుని ద్వారానే ప్రసాదించబడుతుందని హుజూర్ (అ) గుర్తించారని తెలుస్తుంది. నమాజ్ కోసం పరితపించడం, దాని సాధన కేవలం అల్లాహ్‌పైనే ఆధారపడి ఉంటుందని అర్థం చేసుకోవడం, మరియు చిన్న, పెద్ద అనే తేడా లేకుండా ఎందరో ప్రాపంచిక విషయాలలో నిమగ్నమై ఉన్న వాతావరణంలో పెరుగుతూ అటువంటి భావాలను వ్యక్తపరచడం అనేది, ప్రాపంచిక మలినం ఏమాత్రం లేని స్వచ్ఛమైన హృదయం నుండి మరియు ప్రపంచంలో ఒక గొప్ప ఆధ్యాత్మిక పరివర్తనను తీసుకురావాలనే ఉద్దేశ్యంతో దైవికంగా మద్దతు పొందిన హృదయం నుండి మాత్రమే వెలువడగల విషయం.

(మజ్లిస్ ఖుద్దమ్-ఉల్-అహ్మదీయ్యా పాకిస్తాన్ ప్రచురించిన సిరత్ హజ్రత్ మసీహ్-ఎ-మౌఊద్ అలైహిస్సలాతు వస్సలాం. పుట 9)

హజ్రత్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాం ఒకసారి ఇలా అన్నారని హజ్రత్ ముఫ్తీ ముహమ్మద్ సాదిఖ్ సాహిబ్ వివరిస్తున్నారు: "నా యవ్వనం నుండి నాకు ఉపవాసం ఉండటం అలవాటు. నా యవ్వనంలో ఒకసారి నేను ఉపవాసం ఉండి అనారోగ్యానికి గురయ్యాను; అయినప్పటికీ, ఆ తర్వాత నేను ఎలాంటి ఇబ్బంది లేకుండా 29 ఉపవాసాలు పూర్తి చేశాను. అది నాకు నిజంగా ఆనందకరమైన ఈద్. ఉపవాసానికి ప్రత్యేకమైన ఆశీర్వాదాలు ఉన్నాయి. ప్రతి పండుకు దాని స్వంత ప్రత్యేక రుచి ఉన్నట్లే, ప్రతి ఆరాధన రూపానికి దాని స్వంత ప్రత్యేక ఆనందం ఉంటుంది. ఈ భక్తి కార్యాలలో పూర్తిగా వర్ణించలేని ఆధ్యాత్మికత ఇమిడి ఉంది. నిజమైన తపన ఉన్నప్పుడు, నొప్పి మరియు కష్టాలు తగ్గిపోతాయి. మానవ ఆత్మ

కరిగి, నీటిలా ప్రవహించి దేవుడిని చేరే విధంగా ఆరాధన చేయాలి."

(జిక్ర్-ఎ-హబీబ్, పుట 193)

జమీందార్ వార్తాపత్రిక సంపాదకుడైన, సుప్రసిద్ధ నాయకుడు జాఫర్ అలీ ఖాన్ తండ్రి అయిన మౌల్వీ సిరాజొద్దీన్ సాహిబ్, హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం గారు సియాల్‌కోట్‌లో నివసించిన కాలం గురించి ఇలా వ్రాసారు. 1877లో ఒకసారి ఖాదియాన్‌లో ఒక రాత్రి వారికి అతిథులుగా ఉండే గౌరవం తమకు లభించింది. ఆ రోజుల్లో కూడా, వారు ఆరాధన మరియు ప్రార్థనలలో ఎంతగా లీనమై ఉండేవారంటే, తన అతిథులతో కూడా చాలా తక్కువగా మాట్లాడేవారు.

(హయాత్-ఎ-అహ్మద్, సంపుటి 1, పుట 374)

హజ్రత్ మిర్జా బషీర్ అహ్మద్ సాహిబ్ రజి మరొక కథనాన్ని కూడా నమోదు చేశారు. హజ్రత్ భాయ్ 'అబ్దుర్ రహ్మాన్ సాహిబ్ ఖాదియానీ ఇలా వివరించారు: 1900వ సంవత్సరం ఈద్-ఉల్-అధాకు ముందు రోజు - అంటే హజ్ రోజున -హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం హజ్రత్ మౌల్వీ నూరొద్దీన్ సాహిబ్, ఖలీఫతుల్ మసీహ్ అవ్వల్ రజి గారితో ఇలా అన్నారు:

"నేను ఈ హజ్ రోజును ప్రత్యేక ప్రార్థనలలో గడపాలని కోరుకుంటున్నాను. అందువల్ల, తమ తరఫున ప్రార్థనలు చేయించుకోవాలనుకునే స్నేహితులు తమ పేర్లను ఒక జాబితా రూపంలో మీకు సమర్పించి, దానిని నాకు పంపించాలి." దీని ప్రకారం, ఆ రోజున హజ్రత్ మౌల్వీ నూర్-ఉద్-దీన్ సాహిబ్ రజి ద్వారా హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ)కు ప్రార్థనల కోసం అనేక అభ్యర్థనలు చేరవేయబడ్డాయని, మరియు కొంతమంది సహచరులు (సహచరులు) కూడా నేరుగా వారికి వ్రాతపూర్వక అభ్యర్థనలను పంపారని భాయ్ సాహిబ్ పేర్కొన్నారు. ఆ రోజుల్లో, మారుమూల ప్రాంతాల నుండి చాలా మంది స్నేహితులు ఈద్ ప్రార్థనల కోసం ఖాదియాన్‌కు ప్రయాణించి, హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ)ను కలుసుకునే గౌరవాన్ని పొందడం ఆనవాయితీగా ఉండేది. దైవిక ప్రేరణతో వారు కూడా ఈ క్షణంలో పాలుపంచుకున్నారు. ఆ విధంగా, ఖాదియాన్‌లో ఆ రోజు ప్రత్యేక ప్రార్థనలతో, అల్లాహ్ ముందు అసాధారణమైన భక్తిశ్రద్ధలతో, వినయంతో మరియు గొప్ప ఆశీర్వాదాలతో గడిచింది. (సీరత్-ఎ-తయ్యిబా, పుట 204)

సమూహ ప్రార్థన పట్ల తన హృదయపూర్వక వాంఛను వివరిస్తూ, హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) ఒకసారి ఒక సమావేశంలో ఇలా ప్రస్తావించారు:

"ఈ రోజు మళ్ళీ నా తల పరిస్థితి బాగోలేదు, నాకు కళ్ళు తిరుగుతున్నట్లు అనిపిస్తోంది (అంటే, హుజూర్ (అ)కు తరచుగా కళ్ళు తిరిగే సమస్య ఉండేది). సమూహ ప్రార్థన సమయం ఆసన్నమైనప్పుడు, అందరూ కలిసి ప్రార్థనలో నిలబడి ఉంటారు, కానీ నేను వారి మధ్య ఉండలేను అనే ఆలోచన నాకు కలుగుతుంది. (అంటే, ప్రజలు సమూహ ప్రార్థన కోసం సమావేశమై ఉంటారు, కానీ నేను వారి మధ్య హాజరు కాలేను.) ఇది నాలో తీవ్రమైన విచారాన్ని నింపుతుంది, అందుకే నేను లేచి, నా శరీరం నిలకడగా లేకపోయినా సరే, అక్కడికి చేరుకోవడానికి ప్రయత్నిస్తాను. (ఆయనకు కళ్ళు తిరుగుతున్నప్పటికీ, ఆ ఇబ్బందిని లెక్కచేయకుండా, దారిలో తడబడుతూనైనా సరే మసీదుకు వచ్చేవారు.) ఏది ఏమైనా, నేను ప్రయత్నం చేసి మసీదుకు వచ్చాను. ఇలా ఒక్కసారి మాత్రమే జరగలేదు, అనేక సందర్భాలలో జరిగింది. ఈ రోజు కూడా మళ్ళీ అలాగే జరిగింది."

(మల్ఫూజాత్, 2022, సంపుటి 7, పుట 1)

అనారోగ్యంతో ఉన్న సమయాల్లో కూడా, హుజూర్ (అ) మసీదుకు వెళ్ళడానికి తీవ్రంగా కృషి చేసేవారు.

హజ్రత్ మసీహ్ మౌవూద్ (అలైహిస్సలాం)ను కలుసుకోవడానికి సాధారణంగా మసీదే అనువైన ప్రదేశమని హజ్రత్ మౌల్వీ అబ్దుల్ కరీం సియాల్‌కోటి సాహిబ్ పేర్కొన్నారు. హుజూర్ (అ) అనారోగ్యంతో లేనట్లయితే, ప్రతిరోజూ ఐదు పూటల నమాజ్‌లను సమూహికంగా (జమాత్‌తో) క్రమం తప్పకుండా ఆచరించేవారు. వారు (అ) సమూహ ప్రార్థనకు అత్యంత ప్రాధాన్యతనిచ్చేవారు మరియు పదే పదే ఇలా ప్రకటించేవారు: " సమూహికముగా నమాజ్ చదవలేక పోవడం కంటే నన్ను మరేదీ ఎక్కువగా బాధించదు."

సందర్శకుల సంఖ్య తక్కువగా ఉన్న ఒక సమయం తనకు గుర్తుందని మౌల్వీ సాహిబ్ ఇంకా రాశారు. ఆ రోజుల్లో, హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఒక గాఢమైన వాంఛను వ్యక్తం చేస్తూ ఇలా అనేవారు: "నాకు నా సొంత సమాజం (జమాత్) ఉంటే ఎంత బాగుండు! వారితో కలిసి నేను ఐదు పూటల నమాజ్‌లను చదివేవాడిని." వారు (అ) మరల ఇలా తెలిపారు. "నేను అల్లాహ్‌ను వేడుకుంటూ నమాజ్‌లో నిమగ్నమై ఉన్నాను, సర్వశక్తిమంతుడైన అల్లాహ్ నా ప్రార్థనను స్వీకరిస్తాడని నాకు నమ్మకం ఉంది."

మౌల్వీ సాహిబ్ ఈ వృత్తాంతాన్ని రాస్తున్న సమయానికి, అల్లాహ్ అనుగ్రహంతో, సమూహిక నమాజ్‌లకు హాజరయ్యే వారి సంఖ్య 80 లేదా 90కి చేరుకుందని ఆయన పేర్కొన్నారు. నేడు, అల్లాహ్ అనుగ్రహంతో, ఈ జమాత్ (సమాజం) అనేక దేశాలలో మసీదులను స్థాపించుకుంది. అందువల్ల, మనం కూడా మన మసీదులను భక్తులతో నిండుగా ఉంచడానికి కృషి చేయాలి మరియు ఐదు పూటల నమాజులను సామూహికంగా చేయడానికి ప్రతీ ప్రయత్నం చేయాలి. మౌల్వీ సాహిబ్ ఇంకా ఇలా వ్రాశారు: విధిగా చేయవలసిన నమాజును చదివిన తరువాత హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం వెంటనే లోపలికి తిరిగి వెళ్లి పుస్తకాలు వ్రాయడంలో నిమగ్నమయ్యేవారు. అయితే, మగ్రిబ్ నమాజు తరువాత, వారు మసీదులోనే కూర్చొని, స్నేహితుల సమక్షంలో అక్కడే భోజనం చేసి, ఇషా నమాజు చదివిన తరువాత లోపలికి వెళ్లిపోయేవారు.

(సీరత్ హజ్రత్ మసీహ్-ఎ-మౌవూద్ అలైహిస్సలాం పే. 43)

హజ్రత్ అబ్దుల్ సత్తార్ సాహిబ్ ఇలా వివరిస్తారు: హుజూర్ (అ) వాగ్దాన ప్రకటన అధికారికంగా ప్రకటించడానికి ముందు, చిన్న ముబారక్ మసీదు నిర్మించబడినప్పుడు, హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) జుహర్, అసర్, మగ్రిబ్ మరియు ఇషా నమాజ్‌లను సామూహికముగా చదివించేవారు. ఆ సమయంలో, మాలో ముగ్గురం మాత్రమే వారి వెనుక నమాజు చేసేవాళ్ళం. మియాం గులాం సాహెబ్ , అబ్దుల్ సత్తార్ మరియు మియాం జాన్ ముహమ్మద్, వీరు హుజూర్ (అ) వెనుక సామూహికంగా నిలబడేవారు.


వారు మరల ఇలా తెలిపారు: "హుజూర్ (అ) నమాజ్ చదివించిన విధానం నాకు ఇప్పటికీ గుర్తుంది. వారు ప్రతి నమాజ్‌ను దాని సరైన సమయంలో, అత్యంత వినయంతో, సౌమ్యతతో, మరియు హృదయపూర్వక విన్నపంతో చదివేవారు. ..ఆ నమాజ్ తల్లిదండ్రుల నుండి ఏదైనా అడుగుతూ వారి ముందు ఏడ్చే ఒక చిన్నపిల్లవాడిలా ఉండేది. వారి ప్రార్థన ప్రభావం ఎంతగా ఉండేదంటే, వారి వెనుక నిలబడిన మా హృదయాలపై అది గాఢమైన ముద్ర వేసింది. మేము పొందిన మొట్టమొదటి పాఠం ఇదే. హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) నమాజ్‌ను ముగించి కూర్చున్నప్పుడు, మేము వారి ముఖాన్ని చూస్తూ ఉండిపోయేవాళ్ళం. అది ప్రకాశవంతంగా, తేజోవంతంగా కనిపిస్తూ మా హృదయాలను దోచుకునేది."

(రవాయత్ అస్హాబ్-ఎ-అహ్మద్ (అ), సంపుటి 2, పుట 457)

పీర్ సిరాజ్-ఉల్-హఖ్ నుమానీ సాహిబ్ ఈ క్రింది విధంగా తెలిపారు: హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) చదివించే జనాజ నమాజ్ సుబ్‌హానల్లాహ్! సుబ్‌హానల్లాహ్!. అది ఎంత శ్రేష్ఠమైనది మరియు సున్నత్‌కు ఎంత సంపూర్ణంగా అనుగుణమైనది!. వందలాది సందర్భాలలో, ప్రత్యక్ష జనాజ నమాజ్ లేదా పరోక్ష జనాజ నమాజ్‌లో కూడా, వారు జనాజ నమాజ్‌ను చదివించడాన్ని చూసే మరియు వారి వెనుక ఆ నమాజ్ చేసే అవకాశం ఈ అల్పునికి లభించింది.

"ఒక సందర్భంలో, ఖాదియాన్‌కు చెందిన మియాం జాన్ ముహమ్మద్ సాహెబ్ కన్ను మూశారు. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం గారు కూడ జనాజ నమాజ్‌కు హాజరయ్యారు. మృతుడు హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం గారి పట్ల అభిమానం, తీవ్రమైన విశ్వాసం మరియు నిజాయితీ గల అనుచరులలో ఒకరు. హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) గారు మియాం జాన్ ముహమ్మద్ గారిని ప్రేమగా చూసుకునేవారు. హుజూర్ (అ) ఎంత పనిలో నిమగ్నమై ఉన్నప్పటికీ, ఈ సహచరుడు సందర్శించడానికి వచ్చినప్పుడల్లా, ఆయనను కలవడానికి తన పనిని పక్కన పెట్టేవారు. జనాజ ఖబరస్తాన్‌కు చేరుకున్నప్పుడు, హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం స్వయంగా నమాజ్ చదివించారు. ఆ నమాజ్ ఎంతసేపు సాగిందంటే, వారి వెనుక చేతులు కట్టుకొని నిలబడిన మాకు, మా కాళ్ళలో మరియు చేతులలో నొప్పి మొదలైంది. ఇతరుల గురించి నేను చెప్పలేను, కానీ నా విషయానికొస్తే, నిలబడి ఉన్నప్పుడు నా పరిస్థితి మరింత దిగజారింది. ఇది నేను ఇంతకు ముందు ఎన్నడూ అనుభవించని విషయం. ఎందుకంటే, జనాజ నమాజ్‌ను రెండు నిమిషాలలో ముగిసిపోవడాన్ని మనము చూస్తుంటాము. "అప్పుడు, నిజమైన నమాజ్ అంటే ఇదేనని నేను గ్రహించాను! ఆ తర్వాత, నేను నిలదొక్కుకున్నాను, మరియు నాలో ఒక మాధుర్యం, ఆధ్యాత్మిక ఆనందం పెరగడం ప్రారంభమైంది. నిజానికి, వారు (అ) ఆ నమాజ్‌ను ఇంకాస్త పొడిగించాలని నేను కోరుకున్నాను."

J.K WOOD WORKS Mob.9393727201
Spl.Capboard & Interior 7989385296
#8-125/A, Chandanagar, Hyderabad
దుఆ ఆశించువారు: SK Meera sb, Jagadth giri gutta, Hyderabad, (Telangana)



Love for All Hatred for None
99493-56387
Prop:Muhammad Saleem
MASROOR HOTEL
TEA,TIFFIN,MEALS,CHICKEN-BIRYANI,FAST-FOOD AVAILABLE HERE
Near Naidu Petrol Pump, Khammam Rd. Warangal (Telengana)
Mohammad Saleem (Naib Ameer Zila Jamat Ahmadiyya Warangal (Telengana)

ఈ విధంగా, హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం గారు తమ సహచరులలో ప్రార్థన యొక్క నిజమైన ఆనందాన్ని, సంతోషాన్ని నింపారు, ఫలితముగా అది తెచ్చే ఆధ్యాత్మిక ఆనందాన్ని వారే స్వయంగా గుర్తించారు.

మరల ఇలా అన్నారు: " జనాజ నమాజ్ (అంత్యక్రియల ప్రార్థన) ముగిసినప్పుడు, హుజూర్ (అ) తమ నివాసం వైపు బయలుదేరారు. ఒక వ్యక్తి ఇలా విన్నవించుకున్నాడు, 'హుజూర్, నమాజ్ చాలా సేపు చదివించారు. మేము అలసిపోయాము. మీకు ఎలా అనిపించి ఉంటుంది?.' (అంటే, హుజూర్ (అ) కూడా అలసిపోయి ఉండవచ్చు). అందుకు హుజూర్ (అ) ఇలా సమాధానమిచ్చారు: 'అలసట మాకెందుకు? మేము మరణించిన వారి కోసం సర్వశక్తిమంతుడైన అల్లాహ్ క్షమాపణను కోరుతూ ఆయన ముందు విన్నవించుకుంటున్నాము. ఒక బిచ్చగాడు అడుక్కోవడంలో ఎప్పుడైనా అలసిపోతాడా? అడుక్కోవడంలో అలసిపోయినవాడు నిరాశ చెందుతాడు. మేము అడిగేవాళ్ళం, అల్లాహ్ అనుగ్రహించేవాడు. అలాంటప్పుడు అలసిపోవడానికి ప్రసక్తే లేదు? . ఎవరైన ఏదైన ఇస్తారని ఒకరికి అతి చిన్న ఆశ ఉన్నచో, ఆ అన్వేషకుడు వారి గుమ్మం వద్ద కూర్చొనియే ఉంటాడు. అలాంటప్పుడు ఆశలన్నీ ఆ ఒక్క దేవుని ఆస్థానంలోనే ఉంటాయి.' ఆయనే ప్రసాదకుడు (ము'తీ), ఎల్లప్పుడూ ఇచ్చేవాడు (వహాబ్), అత్యంత దయగలవాడు (రహ్మాన్), అత్యంత కరుణామయుడు (రహీమ్), సార్వభౌముడు మరియు సర్వశక్తిమంతుడు. అలాంటప్పుడు అలసట అనే ప్రశ్నే ఎలా తలెత్తుతుంది?"

(తజ్కిరతుల్-మహ్దీ, పుటలు 75-78)

సర్వశక్తిమంతుడైన అల్లాహ్, మనకు మన నమాజ్‌లను అదే జాగరూకతతో చేసే సామర్థ్యాన్ని ప్రసాదించుగాకా!. నిశ్చయంగా, అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త(స) గారి ఆజ్ఞలకు కచ్చితంగా అనుగుణంగా మనం నమాజ్‌లు చేస్తామని హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం బైఅత్ (ప్రమాణం) చేశాము. మనం నమాజ్‌లు చేసేటప్పుడు అల్లాహ్ యొక్క అసంఖ్యాకమైన అనుగ్రహాలను స్మరించుకుంటామని మరియు ఆయనను స్తుతిస్తామని మనం ప్రమాణం చేశాము. మనం చేసిన ఈ ప్రతిజ్ఞను నెరవేర్చే సామర్థ్యాన్ని సర్వశక్తిమంతుడైన అల్లాహ్ మనకు ప్రసాదించుగాకా!.

జుమా నమాజ్ తరువాత, నేను రెండు పరోక్ష జనాజ నమాజ్‌లను (పరోక్ష అంత్యక్రియల ప్రార్థనలను) చదివించుతాను.

మొదటిది మహమూద్ అహ్మద్ బట్ భార్య గారైన గౌరవనీయ అమాతుల్ షరీఫ్ సాహిబా గారిది. నరోవల్‌లోని డైర్యాన్‌వాలాకు చెందిన సాహిబ్, ఇటీవల 84 సంవత్సరాల వయస్సులో కన్నుమూశారు. ఇన్నా లిల్లాహి వ ఇన్నా ఇలైహి రాజిఊన్. 'నిశ్చయంగా, మేము అల్లాహ్‌కు చెందిన వారము మరియు ఆయన వద్దకే మేము తిరిగి వెళ్తాము.' సర్వశక్తిమంతుడైన అల్లాహ్ దయవల్ల, ఆమె ఒక మూసియా. ఆమె గుజరాత్ జిల్లా, షాదివాల్‌కు చెందిన, హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం గారి సహచరుడైన హజ్రత్ మౌల్వి ఉమర్ దీన్ సాహిబ్ రజి గారి కుమార్తె. వారు, 1903లో జీలం యాత్రలో ఉన్నప్పుడు, తనకు వచ్చిన ఒక కల ఆధారంగా హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం గారి బైఅత్ (ప్రమాణం) చేయు భాగ్యాన్ని పొందారు.

ఆమె వారసులు ఉన్నారు. ఆమెకు భర్త, ఆరుగురు కుమారులు, ఐదుగురు కుమార్తెలు మరియు అనేకమంది మనవళ్లు, మనవరాళ్లు ఉన్నారు. ఆమె కుమారులలో ఒకరైన ఆసిఫ్ మహమూద్ బట్ సాహిబ్, టాంజానియాలోని దారుస్సలామ్‌లో సేవలందిస్తున్న జమాత్ మిషనరీ. క్షేత్రస్థాయిలో విధుల్లో ఉండటం వల్ల, వారు తన తల్లి అంత్యక్రియలకు లేదా ఖననానికి హాజరు కాలేకపోయారు. ఆమె మనవళ్లలో ఒకరైన ఉసామా బట్ కూడా ఇక్కడ యూకేలో సేవలందిస్తున్న మిషనరీ, అలాగే ఆమె అల్లుళ్లలో ఒకరు కూడా. ఆమె కుటుంబంలో చాలా మంది జీవిత సమర్పితులు ఉన్నారు.

టాంజానియాలో సేవలందిస్తున్న జమాత్ మిషనరీ అయిన ఆమె కుమారుడు, ఆసిఫ్ మహమూద్ బట్ సాహిబ్ ఇలా వ్రాసారు. ఆమె లెక్కలేనన్ని సద్గుణాలను కలిగి ఉండేవారు. వాటిలో అత్యంత ప్రముఖమైనది అల్లాహ్‌తో ఆమెకున్న గాఢమైన అనుబంధము. ఆమెకు నిజమైన కలలు వచ్చేవి, అవి ఎంతో స్పష్టంగా నిజమయ్యేవి. ఆమెకు పవిత్ర ఖురాన్ పట్ల అపారమైన ప్రేమ ఉండేది, అది ఆమె తన గౌరవనీయమైన తండ్రి నుండి వారసత్వంగా పొందిన ఒక వరం. ప్రతిరోజూ ఫజర్ నమాజ్ తర్వాత, ఆమె తన పరిసరాల్లోని అహ్మదీ మరియు అహ్మదీయేతర పిల్లలకు పవిత్ర ఖురాన్‌ను బోధించేవారు. ఆమెకు పవిత్ర ఖురాన్ పఠించడం మరియు వినడం రెండూ ఇష్టమే. ఆమె కొన్నిసార్లు నేను చెప్పేది కూడా వినేవారు, మరియు ఆమె వృద్ధాప్యంలో కూడా, ఆమెకు అది గుర్తుందో లేదో నిర్ధారించుకోవడానికి నేను మధ్యలో ఆగితే, ఆమె వెంటనే ఆ తర్వాత వచ్చే పదాలను చదవడం కొనసాగించేవారు. ఆమెకు దాదాపు మొత్తం ఖురాన్ కంఠస్థం. తన వృద్ధాప్యంలో చాలా విషయాలు మరచిపోయి నప్పటికీ, సర్వశక్తిమంతుడైన అల్లాహ్ దయవల్ల ఖురాన్ తన జ్ఞాపకంలో పూర్తిగా నిలిచి ఉందని ఆమె చెప్పేవారు.

ఆమెకు హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) గ్రంథాల పట్ల అసాధారణమైన ప్రేమ ఉండేది మరియు ఆమె ఎల్లప్పుడూ కనీసం ఒక పుస్తకాన్ని తనతో ఉంచుకుని చదివేవారు. అదేవిధంగా, ఆమెకు దుర్ర్-ఎ-సమీన్, కలామ్-ఎ-మహమూద్ మరియు హజ్రత్ ఖలీఫతుల్ మసీహ్‌రాబేహ్ (రహ్మతుల్లాహి అలైహి) గారి కవితల పట్ల గాఢమైన అనుబంధం ఉండేది మరియు ఆమె అనేక పద్యాలను కంఠస్థంగా గుర్తుంచు కోగలిగేవారు.

ఆమె అల్లుడు, జమాత్ మిషనరీ అయిన మసూద్ సాహిబ్, తాను ఖాదియాన్‌ను సందర్శించినప్పుడు, హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం గారు ఖాదియాన్ వీధుల గుండా నడిచారు. కాబట్టి వీలైనంత ఎక్కువగా నడవమని ఆమె తనకు సలహా ఇచ్చారని గుర్తుచేసుకున్నారు. సర్వశక్తిమంతుడైన అల్లాహ్ ఆమెకు తన మన్ననలను ప్రసాదించి, ఆమెపై కరుణ చూపించుగాకా!, ఆమె సంతానం పక్షంలో ఆమె దుఆలు స్వీకరించబడు గాకా!.

రెండవ ప్రస్తావన. లాహోర్‌కు చెందిన గౌరవనీయ షేక్ బషీర్ అహ్మద్ సాహిబ్ గారిది. వీరు ఇటీవల 97 ఏళ్ల వయసులో కన్నుమూశారు. ఇన్నా లిల్లాహి వ ఇన్నా ఇలైహి రాజిఊన్. అనగా నిశ్చయంగా, మేము అల్లాహ్‌కు చెందినవారము మరియు ఆయన వద్దకే తిరిగి వెళ్తాము.' అల్లాహ్ దయవల్ల, ఆయన ఒక మూసీ. ఆయనకు ముగ్గురు కుమారులు మరియు ఐదుగురు కుమార్తెలు ఉన్నారు. ఆయన సదర్ అంజుమన్ అహ్మదీయ్యాకు ముఖ్తార్-ఎ-ఆమ్‌గా పనిచేసిన దివంగత షేక్ ముహమ్మద్ దీన్ సాహిబ్ గారి చిన్న కుమారుడు. ఆయన, తూర్పు ఆఫ్రికా, యూకే మరియు యూఎస్‌ఏలకు మాజీ అమీర్ మరియు మిషనరీ-ఇన్-ఛార్జ్‌గా పనిచేసిన దివంగత షేక్ ముబారక్ అహ్మద్ సాహిబ్ గారికి మరియు అరబ్ దేశాలలో సేవలందించిన మిషనరీ అయిన షేక్ నూర్ అహ్మద్ సాహిబ్ మునీర్ గారికి తమ్ముడు కూడా.

ఆయన తహజ్జుద్, ఉపవాసాలు మరియు నమాజ్‌లను క్రమం తప్పకుండా పాటించేవారు; చాలా స్నేహశీలి; మరియు ఉన్నత నైతిక ప్రమాణాలను కలిగి ఉండే వారు. ఆయన జమాత్-ఎ-అహ్మదీయ్యా లాహోర్‌కు నిబద్ధత గల కార్యకర్త మరియు చౌదరి అసదుల్లా ఖాన్ సాహిబ్ మరియు చౌదరి హమీద్ నస్రుల్లా సాహిబ్‌ల ఆధ్వర్యంలోని జిల్లా అమీలాలో చురుకైన సభ్యుడు. 20 సంవత్సరాలకు పైగా, ఆయన తన స్థానిక జమాత్‌కు అధ్యక్షుడిగా సేవలందిస్తూ, జమాత్ వ్యవహారాలను అసాధారణ రీతిలో నిర్వహించారు. మసీదుల నిర్మాణంలోనూ, ఇతర జమాత్ ఆస్తుల సేకరణలోనూ ఆయన కీలక పాత్ర పోషించారు. జమాత్ యొక్క ఆర్థిక కార్యక్రమాలలో ఆయన ఉత్సాహంగా పాల్గొంటూ, తన పిల్లలను కూడా అలాగే చేయమని ప్రోత్సహించారు.

ఖిలాఫత్ పట్ల ఆయనకు ప్రగాఢమైన విశ్వాస బంధం ఉండేది. ఆయన ఎల్లప్పుడూ ఆ బంధాన్ని నెరవేరుస్తూ, ఈ మార్గదర్శకత్వాన్ని తన పిల్లలకు, దగ్గరి బంధువులకు అందించారు. ఆయన అత్యంత వినయశీలి అని, అందరితోనూ ఎంతో అణకువతో వ్యవహరించే వారని నేను గమనించాను.

ఆయన కుమార్తె, ఆసిఫా సయీదుల్లా ఇలా తెలిపారు. వారు ఫజర్ నమాజ్ తర్వాత ఎంతో మధురమైన స్వరంతో ఖురాన్ పఠించేవారని, అది పిల్లలందరి పెంపకంపై గొప్ప ప్రభావాన్ని చూపిందని గుర్తుచేసుకున్నారు. స్థానికంగా నివసించే మరో కుమార్తె, తనకు రబ్వాలో వివాహం జరిగినప్పుడు, రబ్వాలోని మర్కజ్‌కు వెళ్లడం నీ అదృష్టమని వారు చెప్పారని, నీ పిల్లలను సరిగ్గా పెంచే సామర్థ్యాన్ని అల్లాహ్ నీకు ప్రసాదించాలని ప్రార్థించారని తెలిపారు.

ఆయన వ్యాపారవేత్త అయినప్పటికీ, ప్రాపంచిక విషయాలపై దృష్టి పెట్టకుండా, తన పిల్లలకు విశ్వాసం గురించి బోధించడానికే ప్రాధాన్యత ఇచ్చారు. సర్వశక్తిమంతుడైన అల్లాహ్ అతనికి తన మన్ననను ప్రసాదించి, అతనిని కరుణించుగాకా!. వారి సంతానం కోసం వారు చేసిన దుఆలను స్వీకరించుగాకా!.

(ఆమీన్)

99633 83271 Pro. SK.Sultan 97014 62176
Oxygen Nursery
All kind of Plants are Available.
➤ Rajahmundry
➤ Kadiyapu lanka, E.G.dist.
➤ Andhra Pradesh 533126.
➤ #email. oxygennursery786@gmail.com
Love for All...Hatred for None

| వర్తమాన ఖలీఫా వాక్యములు | "అల్లాహ్ మరియు అతని ప్రవక్త పట్ల సంపూర్ణ ప్రేమాభిమానాలు లేనంత వరకు ప్రాపంచిక ప్రేమ తగ్గదు, అదే విధముగా మరణించు సమయంలో మానవునికి మనశ్శాంతి లభించదు, మరణ సమయంలో కల్గె ఆందోళన కూడ దూరం కాదు. " (జుమా ప్రసంగం 14 సెప్టెంబర్ 2018) |
|---|---|

దుఆ ఆశించువారు: *Darga sb, jamat AhmadiyyaVizag (A.P)*

**(2వ పేజీ తరువాత)** అదే విధానాన్ని అనుసరిస్తూ, నా జమాత్‌లోని పేదవారి తరఫున నేను కూడా ఒక బలి సమర్పించడం నా అలవాటుగా మార్చుకున్నాను.”

(అల్-ఫజల్, 17 ఆగస్టు 1922)

బలి మాంసాన్ని పంపిణీ చేసే సమయంలో ముఖ్యంగా పేదలను, బలహీనులను వెదికి వారికి ఇవ్వాలి, తద్వారా అల్లాహ్ ప్రేమదృష్టి మనపై పడుతుంది. దీనిని ప్రాముఖ్యతతో తెలియజేస్తూ హజ్రత్ ఖలీఫతుల్ మసీహ్(రా)బేహ్ రహ్మాగారు ఇలా తెలిపారు:

“మీ అందరికీ నేను గుర్తు చేయునదేమనగా, మీ త్యాగంలో మీ పేద సోదరులను, బలహీనులను, నిరుపేదలను తప్పకుండా జ్ఞాపకం చేసుకోండి. మీకోసం మరియు మీ బంధువుల కోసం మూడవ వంతు భాగాన్ని కేటాయించి ఖర్చు చేయవచ్చు. అయితే కొంత భాగాన్ని జమాత్‌కు అప్పగించండి, తద్వారా వారు పేదలలో మరియు అవసరమైన వారిలో పంపిణీ చేయగలరు. అలాగే మీకు కనిపించే పేదలలో, వారు మీ బంధువులైనా కాకపోయినా, కొంత భాగాన్ని మీరు స్వయంగా పంచండి.

మీ దృష్టి పేదలను వెదికి వారి బలహీనతలను, అంటే వారి ఆర్థిక ఇబ్బందులను మరియు నిరుపేద స్థితిని తొలగించడంపై పడితే, అల్లాహ్ దృష్టి మీపై పడుతుందని నేను మీకు హామీ ఇస్తున్నాను. మరియు దేవుడు మీ బలహీనతలను తొలగిస్తాడు. కాబట్టి ఇది ఒక మహత్తరమైన లాభదాయకమైన వ్యాపారం. పేదలను వెదకడం మరియు వారివద్దకు చేరడం అనేది అల్లాహ్ మిమ్మల్ని వెదికి మీవద్దకు చేరేలా ఆహ్వానిస్తుంది. మరియు అది తప్పకుండా జరుగుతుంది.”

(ఖుత్బాత్-ఏ-తాహిర్, ఈద్ ఉపన్యాసాలు, పుట 642)

అల్లాహ్ మనకు ఇందుకు అనుగుణముగా ఆచరించు భాగ్యాన్ని కల్పించుగాకా! ఆమీన్.

**హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం గారి బైతుల్లా హజ్ కోసం దుఆ:-**

1886లో, సూఫీ అహ్మద్ జాన్ గారు బైతుల్లా (అల్లాహ్ గృహం) యాత్రకు బయలుదేర బోతున్నప్పుడు, హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం గారు వారికి ఒక లేఖ రాశారు:

“ఈ వినయపూర్వక సేవకుడి ఆత్మీయ అభ్యర్థనను జ్ఞాపకం ఉంచుకోండి: అల్లాహ్ కృపవల్ల మీకు బైతుల్లా దర్శనం లభించినప్పుడు, ఆ పవిత్రమైన మరియు మహోన్నత (ప్రశంసనీయ స్థానం)లో, ఈ పేద సేవకుడి తరఫున వినయంతో, వినమ్రతతో మీ చేతులను పైకెత్తి ఈ పదాలతో ప్రార్థించండి:

ఓ అత్యంత కరుణామయుడా! ఒక నిస్సహాయ, బలహీనుడైన, లోపాలు గల, అర్హతలేని ఒక సేవకుడు భారతదేశంలో నివసించే గులాం అహ్మద్ అనే నీ దాసుడు, నీ ముందు ఈ విధముగా అభ్యర్థిస్తున్నాడు. ఓ అత్యంత కరుణామయుడా! నన్ను నీ సంతృప్తికి పాత్రుడిని చేయి, నా తప్పులు మరియు పాపాలను క్షమించుము. నీవు అతిగా క్షమించేవాడివి, అత్యంత దయామయుడివి. మరియు నీ అత్యున్నత సంతృప్తిని పొందే కార్యాలు చేయగల శక్తిని నాకు ప్రసాదించు. నాకు మరియు నా మనోవాంచల మధ్య తూర్పు--పడమరల మధ్య ఉన్నంత దూరాన్ని ఏర్పరచు. నా జీవితం, నా మరణం, నా శక్తులు మరియు నాకు ఉన్న ప్రతిదీ కేవలం నీ మార్గానికే అంకితం కావాలి. నన్ను నీ ప్రేమలోనే జీవింపజేయి, నీ ప్రేమలోనే మరణింపజేయి, మరియు నీ సంపూర్ణ, నిజమైన అనుచరులలో నన్ను లేపు. ఓ అత్యంత కరుణామయుడా! నీవు నాకు అప్పగించిన కార్యమును, నా హృదయంలో నీవు పెట్టిన సేవా ఉత్సాహాన్ని నీ కృపతో పూర్తిచేయిుము. ఈ వినయపూర్వక సేవకుడి చేతుల ద్వారా, నేటికి ఇస్లాం సౌందర్యాల పట్ల అవగాహన లేని వారిపై మరియు ఇస్లాం యొక్క శత్రువులపై ఇస్లాం సత్యాన్ని బహిర్గతపర్చుము. ఈ వినయపూర్వక సేవకుడిని, అతని స్నేహితులు, నిజమైన సహచరులు మరియు అనుచరులందరిని నీ రక్షణ నీడలో క్షమాభిక్షతో, కరుణతో కాపాడుము. వారి దినచర్యలలో మరియు ఆధ్యాత్మిక జీవితంలో నీవే సంరక్షకుడిగా, నిర్వాహకుడిగా ఉండి, వారిని నీ సంతోష నివాసానికి చేరువ చేయిుము. నీ ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం), వారి కుటుంబం మరియు సహచరులపై అపారమైన ఆశీర్వాదాలు, శాంతి మరియు కరుణను ప్రసాదించుము.

ఆమీన్, ఓ సమస్త లోకాల ప్రభువా.”

**(మక్తూబాత్-ఏ-అహ్మదీయా, సంపుటి 3, పుటలు 27--28, ఆధునిక సంచిక)**

| | |
|---|---|
| **అహాదీస్ బోధనలు** | దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా సెలవిచ్చారు: **“ఒక సమాజానికి ప్రారంభములో నేను, అదే సమాజానికి చివరిలో ఈసా ఇబ్నే మరియం ఉన్నచో ఆ సమాజం ఎన్నడు నాశనం కాదు.”** (కంజులుల్ ఆమాల్, హర్ఫ్ అల్ ఖాఫ్, కితాబుల్ ఖియామతు, బాబ్ ఖురూజుల్ మహ్దీ, 38671) |

**దుఆ ఆశించువారు: *Muhammad Nazeer Ahmad sb, warangal, (Telangana)***

**(1వ పేజీ తరువాత తఫ్సీర్)**

అనగా జంతువును వధిస్తున్న వ్యక్తి తన స్వయాన్ని (అహంకారాన్ని) బలిగా సమర్పించడానికి సిద్ధంగా ఉన్నాడని దీని అర్థం. అందువల్ల బలి చేసే వ్యక్తి “నేను దేవుని మార్గంలో అన్నీ త్యాగం చేయడానికి సిద్ధంగా ఉన్నాను.” అని ప్రకటించినట్టే అవుతుంది. రూపకాల భాషలో ఒప్పుకున్న దానిని ఆచరణలో కూడా తప్పకుండా నెరవేర్చడం దీని తర్వాతి దశ అనబడుతుంది. ఎందుకనగా ఆచరణ లేకుండా కేవలం అనుకరణ ఒక్కటే గౌరవానికి కారణం కాజాలదు. అందుకే ఏ వ్యక్తి అయితే జంతుబలితో పాటు తన అహంకారాన్ని కూడా త్యాగం చేస్తాడో అతడే మహోన్నతుల దృష్టిలో గౌరవింపబడతాడు. కానీ కేవలం జంతుబలికే పరిమితమయ్యే వ్యక్తి కేవలం అనుకరించే వాడు, వినోదప్రాయమైన వ్యక్తి మాత్రమే అనబడుతాడు. కాబట్టి అతనికి ఎలాంటి గౌరవపు అర్హత లభించదు. మరల లోతుగా ఆలోచించి చూసినచో, రోజూ జంతువులను వధించడానికి అలవాటు పడ్డ కసాయిలను తప్ప, ఇతరులలో చాలా మందికి జంతువును వధించడాన్ని చూసినచో వారి మనసుపై గాఢమైన ప్రభావం పడుతుంది మరియు వారి ఆలోచనల్లో తీవ్రమైన భావోద్వేగ కదలికలు కల్గుతాయి.

**(తఫ్సీరే కబీర్, సంపుటి 6, పేజీ 57, ప్రచురణ: ఖాదియాన్ 2010)**

**నజారత్ తాలీమ్ ఆధ్వర్యంలోని విద్యా సంస్థలలో టీచర్ల ప్రకటన:**

ఖాదియాన్‌లో ఉన్నటు వంటి పాఠశాలలో జేబిటి స్థాయికి చెందిన కొన్ని ఖాళీలను పూరించడం జరుగుతుంది. పంజాబి, హిందీ, ఇంగ్లీష్, ఉర్దూ సబ్జెక్ట్‌లలో అర్హతతో పాటు అనుభవం గల మరియు సేవా దృక్పథం కల్గిన అభ్యర్థులు నజారత్ దీవాన్ ఖాదియాన్ నుండి దరఖాస్తులను సేకరించి, వాటిని పూరించి జమా చేయగలరు.

**ఖాళీల వివరాలు ఈ విధముగా ఉన్నాయి:**

(1) టి.జి.టి (ట్రేయినిడ్ గ్రాడ్యుయేట్ జనరల్ లైన్ టీచర్. / జే.బి.టి (జూనియర్ బేసిక్ టీచర్ ) ఉపాధ్యాయురాలు. (మహిళ)

అర్హత: 55% మార్కులతో గ్రాడ్యుయేషన్ ఉత్తీర్ణత మరియు బి.ఎడ్ తో పాటు ఏదేని ప్రభుత్వ ఆమోదిత విద్య సంస్థలో కనీసం 3 సంవత్సరాల పాటు పని చేసిన అనుభవం కల్గినవారు. (పోస్ట్ గ్రాడ్యుయేట్ వారికి ప్రాధన్యత ఇవ్వబడును)

(2) కంప్యూటర్ టీచర్. (పురుషుడు)

అర్హత: 55% మార్కులతో గ్రాడ్యుయేషన్ (బి.సి.ఏ) లో ఉత్తీర్ణతతో పాటు ఏదేని ప్రభుత్వ ఆమోదిత విద్య సంస్థలో కనీసం 3 సంవత్సరాల పాటు పని చేసిన అనుభవం కల్గినవారు. (పోస్ట్ గ్రాడ్యుయేట్ వారికి ప్రాధన్యత ఇవ్వబడును)

(3) ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్. (పురుషుడు)

అర్హత: 55% మార్కులతో గ్రాడ్యుయేషన్ (బి.పి.ఎడ్) లో ఉత్తీర్ణతతో పాటు ఏదేని ప్రభుత్వ ఆమోదిత విద్య సంస్థలో కనీసం 3 సంవత్సరాల పాటు పని చేసిన అనుభవం కల్గినవారు.

**నిబంధనలు:**

(1) టెట్ లేదా సి టెట్ అర్హత కల్గిన అభ్యర్థులకు ప్రాధాన్యత ఇవ్వబడును.

(2) యు.జి.సి ద్వారా జారి చేయబడిన సర్టిఫికెట్స్‌ను మాత్రమే ఆమోదించడం జరుగుతుంది.

(3) అభ్యర్థుల వయస్సు కనీసం 20 సంవత్సరాలకు తగ్గకుండా మరియు 40 సంవత్సరాలకు పైబడి ఉండరాదు. తప్పని పరిస్థితిలో మాత్రమే వయస్సు సడలింపును గూర్చి ఆలోచించబడును.

(4) కేంద్రియా సెలక్షన్ కమిటి సభ్యులు నిర్వహించే లిఖిత పూర్వక, మౌఖిక పరమైన పరీక్షల్లో ఉత్తీర్ణులైన మరియు నూర్ ఆసుపత్రి వారిచే ధృవీకరించబడిన ఆరోగ్య సర్టిఫికెట్స్ కల్గిన అభ్యర్థులనే పరిగణలోకి తీసుకడం జరుగుతుంది.

(5) ఎంపికైన అభ్యర్థులు ఖాదియాన్‌లో తన నివాస ఏర్పాట్లను తానుగా చూసుకోవలెను.

(6) పరీక్షలు మరియు ఇంటర్వ్యూల క్రమంలో ఖాదియాన్‌కు జరిగే రవాణ ఖర్చులను అభ్యర్థులే స్వయముగా భరించాలి.

(7) పరీక్షలో ఉత్తీర్ణులైన అభ్యర్థులకు ఇంటర్వ్యూ తేదిని తరువాత తెలియ జేయబడును.

(8) దరఖాస్తు ఫారంను సంబంధిత శాఖ నుండి, శాఖ యొక్క క్రింద తెల్పిన చిరునామ లేదా ఈ మేయిల్ ద్వారా పొందవచ్చును.

(9) దరఖాస్తు ఫారంలు అర్హత మరియు అనుభవపు పత్రాల కాపీలు స్వీయ ఆమోదంతో ఈ ప్రకటన వెలువడిన రెండు మాసాలలోపు నజారత్ దీవాన్ కార్యాలయంనకు చేరుకునేలా చూడవలెను.

(10) అలవెన్స్ మరియు ఇతర విషయాలను గూర్చి తెలుసుకోవడం కోసం అభ్యర్థులు క్రింద ఇవ్వబడిన ఈ మేయిల్ మరియు ఫోన్ నెంబర్స్ ద్వారా కార్యాలయ సమయంలో సంప్రదింపులు జరుపగలరు.

మిక్కిలి వివరాల కోసం సంప్రదించగలరు.
నజారత్ దీవాన్, సదర్ అంజుమన్ అహ్మదియ్య ఖాదియాన్. 143516.
ఫోన్: 9682627592. 9888232530. కార్యాలయం:01872-501130
ఈ మేయిల్: **diwan@qadian.in**

## సీరత్ ఖాతమున్నబియ్యీన్ (సల్లల్లాహు అలైహి వసల్లం):-

రచన: హజ్రత్ మిర్జా బషీర్ అహ్మద్ సాహెబ్ ఎం.ఏ (రజి).

**ప్రవక్తల తండ్రి, అల్లాహ్‌కు ప్రియమిత్రుడు:-**

హజ్రత్ ఇబ్రాహీం (అ) అనే మహనీయ ప్రవక్త పేరు ప్రత్యేక పరిచయం అవసరం లేనిది. ప్రవక్తల తండ్రి, అల్లాహ్‌కు ప్రియమిత్రుడు ఎవరో తెలియని వారు ఎవరున్నారు? ముస్లింలు, క్రైస్తవులు, యూదులు అందరూ ఆయనను గౌరవిస్తారు. ఆయన కాలం సుమారు క్రీస్తుపూర్వం 2100–2200 సంవత్సరాల మధ్యగా భావించబడుతుంది. అంటే, దైవ ప్రవక్త మహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం కంటే సుమారు 2700–2800 సంవత్సరాల ముందు జీవించారు. ఆయన హజ్రత్ నూహ్ (ప్రవక్త నోవా) సంతానానికి చెందిన వారు. మొదట ఇరాక్ ప్రాంతానికి చెందిన ఆయన, తరువాత ఈజిప్టు ద్వారా ప్రయాణించి చివరకు దక్షిణ పాలస్తీనాలో స్థిరపడ్డారు. ఆయన మూడు వివాహాలు చేసుకున్నారు. మొదటి భార్య సారా, రెండవది హాజరా, మూడవది ఖతూరా. చివరిగా పేర్కొన్న భార్య గురించి ఎక్కువ సమాచారం తెలియదు; అయితే ఆమె మద్‌యన్ వంశానికి చెందినదని చెప్పబడుతుంది. ఇబ్రాహీం గారి మొదటి ఇద్దరు భార్యలలో సారా ఆయన సమీప బంధువులలో ఒకరు కాగా, హాజరా మాత్రం వేరే కుటుంబానికి చెందిన ఈజిప్టు మహిళ. ఇద్దరి ద్వారా సంతానం కలిగింది. వారి సంతానం ప్రపంచమంతటా విస్తరించింది. హాజరా ద్వారా ఇస్మాయీల్ (అ) జన్మించాడు; అతడు ఇబ్రాహీం గారి పెద్ద కుమారుడు. సారా ద్వారా ఇస్‌హాక్(అ) జన్మించాడు. ఈ ఇద్దరు పిల్లలు దేవుని ప్రత్యేక వాగ్దానాల ప్రకారం జన్మించారు. వారి పేర్లు కూడా దైవ ప్రకటనల ఆధారంగా పెట్టబడ్డాయి. ముఖ్యంగా ఇస్మాయీల్ విషయంలో, ఇబ్రాహీం మరియు హాజరా ప్రత్యేక ప్రార్థన కూడా చేశారు. "సమిఅ-యీల్" అనే మూలపేరు కూడ దీనిని సూచిస్తుంది. అల్లాహ్ ఈ ఇద్దరికీ మహత్తరమైన శుభాలు ప్రసాదించాడు. ఇస్‌హాక్ సంతానంలోనే మూసా (మోషే), దావూద్ (దావీదు), సులైమాన్ (సొలొమోను), మరియు ఈసా (యేసు క్రీస్తు) వంటి గొప్ప ప్రవక్తలు జన్మించారు. అయితే ఇక్కడ మన దృష్టి ఇస్మాయీల్ సంతానంపైనే ఉంది. వారు అరేబియాలో నివసించారు, వారిలో నుంచే సమస్త మానవాళికి గౌరవకారణమైన అల్లాహ్ ప్రవక్త మహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం అవతరించారు.

హిజాజ్‌లో నివాసం మరియు మక్కా స్థాపన:-

ఇస్మాయీల్ (అ) ఇంకా బాల్యంలో ఉన్నప్పుడు, అతని సవతి తల్లి సారా ఒక విషయంపై కోపగించి, హాజరా మరియు ఆమె కుమారుడిని ఇంటి నుండి పంపించాలని ఇబ్రాహీంను కోరింది. ఇది సహజంగానే ఇబ్రాహీంకు చాలా బాధ కలిగించింది. అయితే అల్లాహ్ ఆయనకు బాధపడవద్దని, సారా చెప్పినట్లే చేయమని ఆజ్ఞాపించాడు. ఇస్‌హాక్ (అ) కూడా ఆయన సంతానమే అయినప్పటికీ, హాజరా కుమారుడు ఇస్మాయీల్ ద్వారా ఒక గొప్ప జాతిని స్థాపించాలని అల్లాహ్ నిర్ణయించాడు. దైవ ఆజ్ఞకు లోబడిన ఇబ్రాహీం, వందల మైళ్ల ప్రయాణం చేసి, హాజరా మరియు ఇస్మాయీల్‌ను అరేబియాలోని హిజాజ్ ప్రాంతంలోని బక్కా లోయకు తీసుకు వచ్చాడు. ఇదే ప్రదేశం ప్రస్తుతం మక్కాగా ప్రసిద్ధి చెందింది. ఆ సమయంలో అది పూర్తిగా నిర్జనమైన, ఎవరూ నివసించని ఎడారి ప్రాంతం. సఫా మరియు మర్వా కొండల సమీపంలో, కొద్దిపాటి ఆహారం, నీటితో ఆ తల్లి, బిడ్డను అక్కడ విడిచి, తిరిగి తన స్వస్థలానికి బయలు దేరాడు. ఇబ్రాహీం వెళ్తున్నాడని గమనించిన హాజరా బాధతో ఆయన వెనకాల పరుగెత్తి "మీరు ఎక్కడికి వెళ్తున్నారు? మమ్మల్ని ఇలా ఒంటరిగా ఎందుకు వదిలిపెడుతున్నారు?" అని అడిగింది.

ఇబ్రాహీం మౌనంగా ముందుకు సాగుతూ ఎటువంటి సమాధానం ఇవ్వలేదు. చివరకు హాజరా అడిగింది: "ఇది అల్లాహ్ ఆజ్ఞనా?" ఇబ్రాహీం సమాధానంగా "అవును" అని మాత్రమే చెప్పాడు. అప్పుడు హాజరా ఇలా అన్నది: "ఇది అల్లాహ్ ఆజ్ఞ అయితే మీరు వెళ్లండి. అల్లాహ్ మమ్మల్ని ఎప్పటికీ నాశనం చేయడు." అని చెప్పి తిరిగి వెళ్లింది. ఈ సంఘటనను ఖుర్‌ఆన్‌లో ఇబ్రాహీం చేసిన ప్రార్థన రూపంలో పేర్కొనబడింది.

అనగా హజ్రత్ ఇబ్రాహీం (అ) గారు హాజరా మరియు ఇస్మాయీల్ (అ) లను మక్కాకు చెందిన లోయలో వదిలి, కొంత దూరం వెళ్ళిన తరువాత వెనుకకు ముఖం త్రిప్పి అల్లాహ్ సన్నిధిలో ఈ విధముగా దుఆ చేశారు:

అనువాదం: "ఓ మా ప్రభువా! నిశ్చయముగా నేను నా సంతానంలో కొంత మందిని నీరు లేని, పంటలు లేని లోయలో, నీ పవిత్ర గృహం సమీపంలో, వారు నీ ఆరాధనను (నమాజ్‌ను) స్థాపించుటకు నివసింపజేశాను. కాబట్టి ప్రజల హృదయాలను వారి వైపు మల్లించుము, వారికి ఫలసంపదను ప్రసాదించుము, వారు నీకు కృతజ్ఞతలు తెలుపునట్లు చేయుము." (ఇబ్రాహీం:38)

చరిత్రకారులు పొందుపర్చినట్లుగా, అలాగే హదీస్‌లలో కూడా పేర్కొన్నట్లుగా చూసినచో, హాజరా వద్ద ఉన్న ఆహారం, నీరు అయిపోయినప్పుడు, ఆమె తన కుమారుడి గురించి తీవ్ర ఆందోళనకు గురైంది. నీటి కోసం ఎంత వెతికినా ఒక్క చుక్క కూడా దొరకలేదు. దాహంతో ఇస్మాయీల్ పరిస్థితి మరింత క్షీణించింది. తన బిడ్డ బాధను చూడలేక హాజరా అక్కడి నుండి కొంత దూరం వెళ్లింది. ఆకాశం వైపు చూసి ఏడుస్తూ, ప్రార్థిస్తూ సఫా కొండపైకి ఎక్కింది. ఎక్కడా నీరు, మనుషులు కనిపించకపోవడంతో మర్వా కొండవైపు పరుగెత్తింది. అక్కడి నుండి మళ్లీ సఫా వైపు పరుగెత్తింది. ఈ విధంగా ఆమె తీవ్ర ఆందోళన, భయంతో ఏడుస్తూ, ప్రార్థిస్తూ సఫా మరియు మర్వా మధ్య ఏడు సార్లు తిరిగింది.

చివరకు ఆమె దుఃఖం తీవ్రస్థాయికి చేరినప్పుడు ఒక అద్భుతమైన స్వరం వినిపించింది: "ఓ హాజరా! అల్లాహ్ నీ ప్రార్థనను మరియు నీ బిడ్డ ప్రార్థనను విన్నాడు." ఆమె తిరిగి వచ్చి చూసినప్పుడు, ఇస్మాయీల్ సమీపంలో ఒక దేవదూత నిలబడి తన పాదమడమతో నేలను తవ్వుతున్నట్లు కనిపించాడు. అక్కడి నుండి నీరు ఉబికి రావడం ప్రారంభమైంది. హాజరా ఆనందానికి అవధులు లేకపోయాయి. వెంటనే ఆమె తన కుమారుడికి నీరు త్రాగించింది. ఆ నీరు వృథా కాకుండా ఉండే అందుకు చుట్టూ రాళ్లు పెట్టి చిన్న కుంటలా తయారు చేసింది. హజ్రత్ ఇబ్నే అబ్బాస్ రజి ఇలా ఉల్లేఖించారు: దైవ ప్రవక్త మహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా అన్నారు:

"అల్లాహ్ హాజరాపై కరుణను చూపుగాకా!. ఆమె ఆ నీటిని ఆపకపోయి ఉంటే, అది ప్రవహించే నదిగా మారిపోయేది." హజ్ యాత్రలో సఫా మరియు మర్వా మధ్య పరుగెత్తే ఆచారం హాజరా పవిత్ర జ్ఞాపకార్థమే అని కూడా ప్రవక్త (స) చెప్పారు. ఈ సంఘటనల గురించి కొంత మార్పులతో బైబిల్‌లో కూడా ప్రస్తావన ఉంది.

హాజరా జ్ఞాపకాన్ని ప్రవక్త మహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం గారు ఎంతగానో గౌరవించేవారు. ఒక సందర్భంలో వారు(స) తన సహచరులతో ఇలా అన్నారు: "అల్లాహ్ మీకు ఈజిప్టుపై విజయం ప్రసాదించినప్పుడు, అక్కడి ప్రజలతో దయగా, మంచిగా ప్రవర్తించండి. ఎందుకంటే మా తల్లి హాజరా ఈజిప్టు మహిళ." కావున మీపై ఈజిప్టు ప్రజల హక్కు ఉన్నది.

అలా, ఇబ్రాహీం (అ) గారు హాజరా మరియు ఇస్మాయీల్ (అ)ను మక్కాకు చెందిన నిర్జన లోయలో వదిలి వెళ్లిన తరువాత, ఒక అద్భుతమైన ఊట ఉద్భవించింది. ఈ ఊట తరువాత ఇస్లామీయ చరిత్రలో "జమ్‌జమ్ బావి"గా ప్రసిద్ధి చెందింది. ఈ నీటి మూలం కారణంగా బక్కా లోయలో ప్రజలు క్రమంగా నివసించడం ప్రారంభించారు. అలా మక్కా నగరం ఏర్పడింది.

అక్కడ మొదట నివసించిన తెగ యెమెన్‌కు చెందిన ఖహ్తానీ అరబ్బుల శాఖ అయిన జుర్హుమ్ తెగ అని చెప్పబడుతుంది. వారు మొదట కొంత దూరంలో నివసించే వారు. కానీ జమ్‌జమ్ ఊట గురించి తెలుసుకున్న తరువాత, వారి నాయకుడు ముజాజ్ బిన్ అమర్ జుర్హుమీ హాజరా వద్ద ఆ ఊట సమీపంలో నివసించేందుకు అనుమతి కోరాడు. హాజరా సంతోషంగా అనుమతించగా, జుర్హుమ్ తెగ ప్రజలు బక్కా లోయలో స్థిరపడ్డారు.

ఇష్మాయీలు (అ) దేవునికి అర్పితమైన బలి:-

హజ్రత్ హాజరా మరియు హజ్రత్ ఇష్మాయీలు (అ) లను బక్కా (మక్కా) లోయలో నివసింపజేసిన తరువాత, హజ్రత్ ఇబ్రాహీం (అ) అప్పుడప్పుడు మక్కాకు వచ్చి తిరిగి వెళ్తుండేవారు. ఇష్మాయీలు (అ) కొంత పెద్దవాడైనప్పుడు, కొన్ని సంప్రదాయాల ప్రకారం సుమారు పదమూడు సంవత్సరాల వయస్సులో ఇబ్రాహీం (అ) ఒక కల చూశారు. ఆ కలలో ఆయన ఇష్మాయీలును బలి ఇస్తున్నట్లు కనిపించింది. ఆ సమయంలో మానవ బలి బాహ్య రూపంలో అనుమతించబడదనే బోధన ఇబ్రాహీం(అ)పై ఇంకా అవతరించలేదు. అంతేకాక ఆ దేశంలో మానవ బలి అనే ఆచారం కూడా ఉండేది. అందువల్ల ఇబ్రాహీం(అ) ఆ కలను యథార్థంగా నెరవేర్చాలని భావించి, దాని గురించి ఇష్మాయీలుతో మాట్లాడారు. అప్పుడు ఇష్మాయీలు (అ), "మీరు మీ కలను తప్పకుండా నెరవేర్చండి. దేవుని ఆజ్ఞకు లోబడేందుకు నేను సిద్ధంగా ఉన్నాను" అని సమాధానమిచ్చాడు.

దాంతో ఇబ్రాహీం(అ) ఇష్మాయీలును బయటకు తీసుకెళ్లి నేలపై పడుకోబెట్టి బలి ఇవ్వడానికి సిద్ధమయ్యారు. విశ్వాసపాత్రుడైన కుమారుడు నిశ్శబ్దంగా, ఆనందంతో తన మెడను తండ్రి ముందుంచాడు. అబ్రాహాము కత్తిని ఉపయోగించ బోతున్న సమయంలో ఒక దేవదూత స్వరం వినిపించింది:

"ఓ ఇబ్రాహీం(అ)! నీ ఉద్దేశ్యపరంగా నీవు నీ కలను నెరవేర్చావు. ఇప్పుడు ఇష్మాయీలును విడిచిపెట్టి, అతని స్థానంలో ఒక గొర్రెపోతును దేవుని మార్గంలో బలి ఇవ్వు. బాహ్యంగా అదే దానికి సంకేతం అవుతుంది. అయితే ఈ కల యొక్క నిజమైన అర్థం మరొక విధంగా నెరవేరుతుంది." కావున ఇబ్రాహీం(అ) అలాగే చేశారు. ఈ సంఘటనకు జ్ఞాపకార్థంగా ముస్లింలలో హజ్ సమయంలో జంతు బలి చేసే ఆచారం స్థాపించబడింది. ఈ కల యొక్క నిజమైన అర్థం గురించి భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. అయితే మా అభిప్రాయం ప్రకారం "బలి" అంటే దేవుని సేవకు తన జీవితాన్ని అంకితం చేయడం. లోకదృష్టిలో అది తన జీవితాన్ని త్యాగం చేయడానికి సమానం. నిజానికి, ఇష్మాయీలును మక్కాలో నివసింపజేసిన ప్రధాన ఉద్దేశ్యం కాబాను నిర్మించడం మరియు ఇష్మాయీలు జీవితాన్ని దాని సేవకు, ఏకదైవారాధన స్థాపనకు అంకితం చేయడం.

తరువాత కాలక్రమేణా విగ్రహారాధన ఏకదైవారాధనపై ఆధిపత్యం సాధించినప్పుడు, అల్లాహ్ తాలా ఈ పవిత్ర కల యొక్క లోతైన అర్థాన్ని ఇస్మాయీల్ (అ) సంతతిలో జన్మించిన దైవ ప్రవక్త మహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ద్వారా నెరవేర్చాడు. ప్రవక్త (స) మరియు వారి అనుచరులు ఏకదైవారాధన ప్రచారం కోసం తమ జీవితాలను నిజమైన అర్థంలో అర్పించారు. ఇదే ఖుర్‌ఆన్‌లో పేర్కొన్న "మహా బలి". ఇస్మాయీలు యొక్క బాహ్య బలి స్థానంలో దేవుడు మరింత గొప్ప బలిని నిర్ణయించాడనే భావం.

హజ్ సమయంలో జంతువులను బలి ఇచ్చే ఆచారం కూడా ఈ పవిత్ర జ్ఞాపకాన్ని గుర్తుచేసుకోవడానికే. అది దేవుని మార్గంలో తమను తాము అర్పించేందుకు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండాలని ముస్లింలకు గుర్తుచేస్తుంది.

ఇస్మాయీల్ (అ) మరియు హాజరా గురించి వచ్చిన కొన్ని అభ్యంతరాలకు సమాధానాలు:

ఈ సందర్భంలో కొందరు క్రైస్తవ చరిత్రకారులు ఇస్మాయీలు అరేబియాలో స్థిరపడ్డాడనే చారిత్రక ఆధారం లేదని అభ్యంతరం వ్యక్తం చేస్తారు. అందువల్ల ప్రవక్త మహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇస్మాయీల్(అ) సంతతికి చెందిన వారని వారు అంగీకరించరు. అలాగే ఇబ్రాహీం (అ) బలి ఇవ్వదలచిన కుమారుడు ఇస్మాయీల్ (అ) కాదు, బైబిలు ప్రకారం ఇస్‌హాఖ్ (అ)అని వారు వాదిస్తారు.

ఈ రెండు అభ్యంతరాలకు సంక్షిప్త సమాధానాలు క్రింద ఇవ్వబడ్డాయి.

మొదటి అభ్యంతరానికి సమాధానం: 1) ఇస్మాయీల్ (అ) అరేబియాలో స్థిరప డ్డాడనే విషయం మరియు మక్కాకు చెందిన ఖురైష్ వంశం ఇస్మాయీల్ (అ) సంతతికి చెందినదనే విషయం అరబ్బుల ఏకగ్రీవ సంప్రదాయాల ద్వారా బలంగా నిరూపించబడింది. ప్రవక్త మహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం గారి కాలానికి ముందు గానీ, తరువాత గానీ దీనికి విరుద్ధమైన అరబ్ సంప్రదాయం ఏదీ లేదు. ఒక జాతి చరిత్రకు సంబంధించిన అత్యంత విశ్వసనీయ సాక్ష్యం ఆ జాతి యొక్క స్వీయ సంప్రదాయాలే కావున, పక్షపాత రహితులు ఎవరైనా కూడ ఇస్మాయీల్ (అ) అరేబియాలో స్థిరపడ్డాడని మరియు ఖురైష్ వంశం వారి సంతతికి చెందినదని సందేహించ లేరు.

2) మిత్రులు, శత్రువులు ఇరువర్గాల వారు ఏకీభవించిన మరియు నిర్దిష్టమైన చారిత్రకతను పేర్కొన్న పవిత్ర ఖుర్‌ఆన్ కూడా ఖురైష్ వంశీయులను ఇబ్రాహీం (అ) సంతతి వారిగానే పేర్కొంటుంది.

3) బైబిలు ప్రకారంగా చూసినాకూడ, సారా అసంతృప్తి కారణంగా హాజరా మరియు ఇస్మాయీల్ (అ) తమ స్వదేశం నుండి పంపివేయబడ్డారని గలదు. వారు స్థిర పడిన ప్రాంతం హిజాజ్ కాకపోతే, వారి సంతతి మరెక్కడ స్థిరపడింది?

4) బైబిలు హాజరా మరియు ఇస్మాయీల్ (అ) నివసించిన ప్రదేశాన్ని ఆహారం, నీరు, నివాసం లేని బంజరు ఎడారిగా వర్ణిస్తుంది. అది మక్కా యొక్క నిర్జన లోయకు పూర్తిగా పోలి ఉన్నది.

5) బైబిలు ప్రకారం వారు తమ స్వదేశం విడిచిన తరువాత పారాన్ అనే ప్రాంతంలో నివసించారు. "పారాన్" అనే పదానికే బంజరు ఎడారి అనే అర్థం ఉంది. అరబ్ భౌగోళిక శాస్త్రజ్ఞులు పారాన్‌ను మక్కా లేదా హిజాజ్ పర్వతాలతో గుర్తిస్తారు. అరేబియాతో పరిచయం ఉన్నవారు చెబుతారు: మక్కా మరియు మదీనా మధ్య వాడీ ఫాతిమాలో పూలు అమ్మే పిల్లలను ఆ పూలు ఎక్కడి నుండి తెచ్చారని అడిగితే, "పారాన్ ఎడారి నుండి" అని సమాధానం ఇస్తారు. అందువల్ల మరెక్కడైనా "పారాన్" అనే ప్రదేశం ఉన్నప్పటికీ, ఇస్మాయీల్ (అ) సంతతికి సంబంధించిన పారాన్ అనేది తప్పకుండా హిజాజ్‌లో ఉన్నదేనని భావించాలి.

6) బైబిలు ప్రకారం ఇస్మాయీల్ (అ) సంతతి "హవైలా నుండి షూర్ వరకు" నివసించింది. ఈ ప్రాంతాలు అరేబియా పరిసర ప్రాంతాలను సూచిస్తాయని క్రైస్తవ పండితులే అంగీకరిస్తున్నారు.

7) బైబిలు ఇస్మాయీల్(అ)ను అడవిలో నివసించే వ్యక్తిగా వర్ణిస్తుంది. ఇది మక్కాలో అతని నివాసానికి పూర్తిగా సరిపోతుంది. ఆసక్తి కరమైన విషయం ఏమిటంటే "అరబ్" అనే పదానికీ ఎడారి, నిర్జన ప్రాంతం అనే భావాలున్నాయి.

8) ప్రసిద్ధ క్రైస్తవ అపోస్తలుడైన సెయింట్ పాల్ కూడా హాజరాకు అరేబియాతో సంబంధం ఉందని అంగీకరించాడు.

9) ఇస్మాయీల్ (అ) కుమారుడిగా విశ్వవ్యాప్తంగా గుర్తించబడిన కేదార్ సంతతి అరేబియాలో నివసించిందని బైబిలు పేర్కొంటుంది.

10) ఒక ఎన్సైక్లోపీడియా ప్రకారం: "కేదార్ ఇస్మాయీల్ (అ)గారి కుమారుడు. అతని సంతతి అరేబియా దక్షిణ భాగంలో నివసించింది."

పై ఆధారాలన్నింటి ద్వారా ఇస్మాయీల్ (అ) అరేబియాలో స్థిరపడ్డారని మరియు అరబ్ జనాభాలో ఒక భాగం వారి సంతతికి చెందినదని స్పష్టమవుతుంది. ఇది నిరూపించబడిన తరువాత, ఖురైష్ వంశం ఇస్మాయీల్ (అ) సంతతికి చెందినదని తెలిపే బలమైన అరబ్ సంప్రదాయాలను తిరస్కరించడం న్యాయసమ్మతం కాదు.

**(సీరత్ ఖాతమున్నబియ్యీన్ (స) పేజి 74-80. రచన: హజ్రత్ మిర్జా బషీర్ అహ్మద్ ఎం.ఏ రజి గారు)**

(తదుపరి సంచికలో చదువుము).

(12వ పేజీ తరువాత) చాలా మంది ముస్లింలు హజ్రత్ ఈసా అలైహిస్సలాం ఆకాశం నుండి తిరిగి అదే ప్రవక్త హోదాతో వస్తారని, ఆయన రాకతో ఖాతమున్ నబువ్వత్‌కు ఎలాంటి భంగం కలగదని నమ్ముతారు. అయితే అల్లాహ్ తాలా వారిని బనీ ఇస్రాయీల్ వైపు ప్రవక్తగా పంపించాడు. కాబట్టి వారు మళ్ళీ వస్తే "ప్రవక్త" అనే హోదాతోనే వస్తారని. అల్లాహ్ ఒకరికి ప్రవక్త హోదా ఇచ్చి తర్వాత దాన్ని తీసివేయడం అసాధ్యమని భావిస్తున్నారు. అందువల్ల హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లంల తరువాత కూడా ఒక ప్రవక్త రానున్నాడని సాధారణ ముస్లింలు కూడా నమ్ముతున్నారు.

వాస్తవానికి హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా చెప్పారు: రాబోయే వ్యక్తి నా సమాజంలోనుండే వస్తాడు. ఒక హదీస్‌లో ఉంది: సూరహ్ జుముఅహ్ అవతరించినప్పుడు, ప్రవక్త "వఆఖరీన మిన్‌హుం లమ్మా యల్‌హకూ బిహిం" అనే సూక్తిని చదివారు. అప్పుడు ఒక అనుచరుడు ఇలా అడిగారు: అనుచరుల స్థాయిని పొందేవారు కానీ ఇంకా అనుచరులలో చేరని వారు ఎవరు?. దానికి ప్రవక్త (స) హజ్రత్ సల్మాన్ ఫార్సీ (రజియల్లాహు అన్హు) భుజంపై చేయి వేసి ఇలా అన్నారు: " ఒకవేళ విశ్వాసం కృతీకా నక్షత్రం వరకు వెళ్ళిపోయినా, వీరిలో కొందరు దాన్ని తిరిగి తీసుకువస్తారు."

హుజూర్ అన్వర్ తెలిపారు: ప్రవక్త (స) ఈ హదీస్ ద్వారా రెండు విషయాలు స్పష్టమవుతున్నాయి. మొదటిది, రాబోయే వ్యక్తి అరబ్‌కు చెందిన వ్యక్తి కాదు. రెండవది, అతడు ముస్లిం సమాజంలో నుండే వస్తాడు.

ప్రవక్త (స) మరొకచోట ఇలా అన్నారు: "అతని రాక నా రాక వంటిదే." అంటే రాబోయే వ్యక్తి నా మార్గాన్ని అనుసరిస్తాడు మరియు నన్ను పూర్తిగా అనుసరిస్తాడు.

హుజూర్ అన్వర్ అయ్యదహుల్లాహు తఆలా బిన్రసిహిల్ అజీజ్ ఇలా తెలిపారు: హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం చేసిన ఈ భవిష్యవాణి ప్రకారం హజ్రత్ మిర్జా గులాం అహ్మద్ అలైహిస్సలాం వాగ్దాత మసీహ్ మరియు మహ్దీగా వచ్చారు. వారు ఎటువంటి కొత్త ధర్మశాస్త్రాన్ని తీసుకురాలేదు. నిజానికి వారు పవిత్ర ఖుర్‌ఆన్ బోధనలను అత్యుత్తమంగా వివరించేందుకే వచ్చారు. హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం తరువాత ఒక ప్రవక్త రావచ్చు, కానీ అతడు ధర్మశాస్త్రమును తీసుకురాని ప్రవక్త అవుతాడు అని మేము విశ్వసించుతాము. మేము హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లంను ఖాతమున్ నబియ్యీన్ అని, ఖుర్‌ఆన్ చివరి గ్రంథమని, ఇకపై కొత్త దైవ గ్రంథం రాదని విశ్వసిస్తున్నాము. అలాగే వారిపై సంపూర్ణ ప్రేమ, విధేయతతో మరియు కొత్త ధర్మగ్రంథం లేకుండానే ఒక ప్రవక్త రావచ్చని కూడా మేము విశ్వసిస్తున్నాము.

హుజూర్ అన్వర్ మరింతగా తెలిపారు: హజ్రత్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాం ఒకసారి ఇలా చెప్పారు: ఒక రాత్రి నేను హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం పై ఎంతో అధికంగా దురూద్ పంపించాను, దాని వల్ల నా హృదయం మరియు ఆత్మ పరిమళ భరితమయ్యాయి. అదే రాత్రి నాకు ఒక స్వప్నం వచ్చింది. అందులో దేవదూతలు ప్రకాశవంతమైన పవిత్ర జలాలతో నిండిన పాత్రలను నా ఇంటికి తీసుకువస్తున్నారు. వారిలో ఒక దేవదూత ఇలా అన్నాడు: "ఇవి నీవు ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం పై పంపిన దురూద్‌ల ఫలితమైన అనుగ్రహాలు." మరొకసారి వారిపై ఒక దైవవాణి అవతరించింది. పరలోకంలోని ప్రజలు వివాదంలో ఉన్నారు మరియు మత పునరుద్ధరణ కోసం దైవ సంకల్పం ఉత్సాహంగా ఉంది. అదే సమయంలో వారు ఒక స్వప్నంలో ప్రజలు ఒక ముజద్దిద్ కోసం వెతుకుతున్నారని చూశారు. అప్పుడు ఒక వ్యక్తి వారిని చూపిస్తూ ఇలా అన్నాడు: "ఇతనే అల్లాహ్ ప్రవక్త (స)ను ప్రేమించే వ్యక్తి." కాబట్టి హజ్రత్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాం పొందిన స్థానం హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లంపై ఉన్న ప్రేమ వల్లే లభించింది.

జర్నలిస్ట్ 'దైవవాణిల పరంపర ఇంకా కొనసాగుతోందా?" అని అడిగినప్పుడు, హుజూర్ అన్వర్ సమాధానమిస్తూ ఇలా అన్నారు: అల్లాహ్ యొక్క అన్ని గుణాలు ఈరోజూ యథాతథంగా కొనసాగుతున్నాయని మేము విశ్వసిస్తున్నాము. అల్లాహ్ గుణాలలో ఏదీ ముగియదు. ఆయన గతంలో కూడా మాట్లాడాడు, ఈరోజూ మాట్లాడుతున్నాడు. ప్రజలకు నిజమైన స్వప్నాలు వస్తున్నాయి, అల్లాహ్ ప్రార్థనలను వింటున్నాడు మరియు స్పష్టత ప్రసాదిస్తున్నాడు.

హుజూర్ అన్వర్ తెలిపారు: అల్లాహ్ మాట్లాడుతాడు మరియు ఈరోజూ తన బందాలతో సంభాషిస్తాడు. దైవ వహీ మరియు ఇల్హామ్ వ్యవస్థ ఇప్పటికీ కొనసాగుతోంది; దాన్ని ఎవరూ ఆపలేరు.

మరొక ప్రశ్నకు సమాధానంగా హుజూర్ అన్వర్ అయ్యదహుల్లాహు తఆలా బిన్రసిహిల్ అజీజ్ తెలిపారు: ఈరోజు ప్రపంచ పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. దానికి ప్రధాన కారణం ప్రజలు తమ సృష్టికర్తను మరచిపోవడమే. కాబట్టి మనుషులు అల్లాహ్ వైపు తిరిగిరావాలి, ఆయనను గుర్తించాలి. అల్లాహ్‌ను మరచిపోయినవారు ప్రాయశ్చిత్తం చేసుకొని ఆయన క్షమాపణ కోరాలి. మనుషులు పరస్పరం ప్రేమించుకోవాలి మరియు సోదరభావం, ప్రేమ బంధాలను స్థాపించుకోవాలి.

(తదుపరి సంచికలో)

EDITOR
SYED RASOOL NIYAZ
Mobile. :+91 9876332272
SUB EDITOR:
MUHAMMAD AKBAR
Mobile. :+91 9948692101
e-mail:
teluguweeklybadar@gmail.com

REGISTERED WITH THE REGISTERAR OF THE NEWS PAPERS FOR INDIA AT NO: PUNTEL/2016/68817

Weekly BADAR Qadian బదర్ తెలుగు వార పత్రిక

Qadian- 143516, Distt: Gurdaspur (Pb.) INDIA

POSTAL REG NO GDP-38/2026-2028. Vol. 11. Thursday, 28 - MAY 2026, Issue No - 22

ACT.MANAGER
ATHAR AHMAD SHAMIM
Mobile. : +91 98156 39670
e-mail managerbadrqnd@gmail.com
www.alislam.org/badr

ANNUAL SUBSCRIPTION:Rs.600/- (Per Issue: 12/- ) (WEIGHT: 20-50, grms / issue)

## సయ్యదినా హజ్రత్ అమీరుల్ మోమినీన్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ అయ్యదహుల్లాహ్ తాలా బినస్రిహిల్ అజీజ్ గారి ఆస్ట్రేలియా పర్యటన 2013.

**19 అక్టోబర్, శనివారం, 2013:-**

ఉదయం 5:10 గంటలకు హజ్రత్ అమీరుల్ మొమినీన్ బైతుల్ హుదా మసీదుకు విచ్చేసి ఫజర్ నమాజును చదివించారు. నమాజు అనంతరం హుజూర్ తమ నివాసానికి తిరిగి వెళ్లారు.

ఉదయం సమయంలో హుజూర్ కార్యాలయానికి సంబంధించిన ఉత్తరాలు, నివేదికలు, విదేశాల నుండి వచ్చిన ఫ్యాక్సులు మరియు నివేదికలను పరిశీలించి వాటిపై అవసరమైన సూచనలు జారీ చేశారు.

కార్యక్రమం ప్రకారం ఉదయం 11:00 గంటలకు హుజూర్ తన కార్యాలయానికి విచ్చేశారు.

ఎస్‌బిఎస్ రేడియో స్టేషన్ ప్రతినిధితో హుజూర్ ఇంటర్వ్యూ:-

ఆస్ట్రేలియా ప్రభుత్వ రేడియో స్టేషన్ ఎస్‌బిఎస్ చెందిన ఒక ప్రతినిధి, హుజూర్ రాకముందే వారితో ఇంటర్వ్యూ చేయడానికి ఎదురుచూస్తూ ఉన్నారు. ఎస్‌బిఎస్ అనేది జాతీయ స్థాయి ప్రభుత్వ రేడియో స్టేషన్. ఈ రేడియో స్టేషన్ ప్రపంచంలోని 74 భాషల్లో కార్యక్రమాలను ప్రసారం చేస్తుంది.

పత్రికా ప్రతినిధి హుజూర్‌ను అడిగిన మొదటి ప్రశ్న అహ్మదీయ ముస్లిం జమాత్ చరిత్ర గురించి. ఈ జమాత్ ఎప్పుడు, ఎలా స్థాపించబడింది? ఈ జమాఅత్ ఎలా ప్రారంభమైంది?.

ఈ ప్రశ్నకు సమాధానంగా హుజూర్ ఇలా అన్నారు: "దీనికోసం మనం పద్నాలుగు వందల సంవత్సరాల వెనక్కి వెళ్లాలి. దైవ ప్రవక్త మహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఒక భవిష్యవాణి చేశారు. ఒకానొక కాలం వస్తుంది, అప్పుడు ఇస్లాం పేరుకు మాత్రమే ఉంటుంది. మరేమీ మిగలదు, ఖుర్‌ఆన్‌లో పదాలు తప్ప దాని అసలు స్ఫూర్తి మిగలదు. అది చీకటి యుగం అవుతుంది. అప్పుడు పద్నాలుగో శతాబ్దంలో అల్లాహ్ తఆలా ఒక సంస్కర్తను పంపిస్తాడు. ఆయనకు మసీహ్ మరియు మహ్దీ అనే బిరుదులు ఉంటాయి. ఆయన ముస్లిం సమాజంలో నుంచే వస్తారు. ఆయన పవిత్ర ఖుర్‌ఆన్ బోధనలను పునరుద్ధరిస్తారు మరియు ఇస్లాం యొక్క నిజమైన, అసలైన బోధనలను ప్రపంచానికి అందిస్తారు."

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) చేసిన భవిష్యవాణి ప్రకారం ఆ వాగ్దాత మసీహ్ మరియు మహ్దీ, ప్రవక్త (స)పేర్కొన్న అన్ని సూచనలతో ప్రత్యక్షమయ్యారని, వారే 1889 సంవత్సరంలో ఆయన అహ్మదీయ ముస్లిం జమాత్‌కు పునాది వేశారని మేము విశ్వసిస్తున్నాము .

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఆ రానున్న మసీహ్ మరియు మహ్దీ యొక్క సత్యతకు సంబంధించిన సూచనల్లో ఒకటిగా రమజాన్ నెలలో నిర్దిష్ట తేదీలలో సూర్యగ్రహణం మరియు చంద్రగ్రహణం సంభవించడంగా పేర్కొన్నారు. అందువల్ల, మేము వాగ్దాత మసీహ్ మరియు మహ్దీగా విశ్వసించే ఖాదియాన్‌కు చెందిన హజ్రత్ మిర్జా గులాం అహ్మద్ (అలైహిస్సలాం), దైవ ప్రవక్త భవిష్యవాణి ప్రకారం తాను మసీహ్ మరియు మహ్దీ అని ప్రకటించి అధికారికంగా అహ్మదీయ ముస్లిం జమాత్‌ను స్థాపించిన తరువాత, 1894లో ప్రపంచపు తూర్పు భాగంలో రమజాన్ నెలలో నిర్దిష్ట తేదీలలో సూర్యగ్రహణం మరియు చంద్రగ్రహణంలు సంభవించాయి. తరువాతి సంవత్సరం అనగా1895లో ఇదే సంఘటన ప్రపంచపు పడమటి భాగంలో కూడా జరిగింది. ఇది వారి ప్రకటనకు మద్దతుగా అల్లాహ్ చూపించిన దివ్య సూచన.

వారు (అ) ఇలా ప్రకటించారు:

"దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) భవిష్యవాణి చేసిన మసీహ్ మరియు మహ్దీని నేనే. నా అవతరణ యొక్క ముఖ్యఉద్దేశ్యం ఏమిటనగా, మనుషులు తమ సృష్టికర్తను గుర్తించి, దేవుని వైపు తిరిగి వచ్చేలా చేయడం మరియు ఒకరి మరొకరు హక్కులను నెరవేర్చేలా చేయడం."

అలా, అల్లాహ్ హక్కులు మరియు మానవుల హక్కులను నెరవేర్చడం కోసం వారు (అ) అహ్మదీయ ముస్లిం జమాత్‌ను స్థాపించారు.

ఆ తరువాత పత్రికా ప్రతినిధి ఇలా ప్రశ్నించారు: "1889లో జమాత్ స్థాపించబడిన తర్వాత, హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) మరణానంతరం ఏ విధానాన్ని అనుసరించారు? ఖలీఫాను ఎలా ఎన్నుకుంటారు?"

దీనికి హుజూర్ సమాధానంగా ఇలా అన్నారు:

"మా బోధనలలో ఏదీ దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) బోధనలకు విరుద్ధం కాదు. ప్రవక్త ఇలా అన్నారు. అల్లాహ్ కోరినంతకాలం మీలో ప్రవక్తత్వం ఉంటుంది. తరువాత ప్రవక్తత్వ పద్ధతిలో ఖిలాఫత్ స్థాపించబడుతుంది. తరువాత అల్లాహ్ కోరినప్పుడు ఆ అనుగ్రహాన్ని తొలగిస్తాడు. ఆ తరువాత అణచివేత రాజ్యాలు ఏర్పడతాయి. ఆ కాలం ముగిసిన తరువాత మరింత క్రూరమైన పాలన వస్తుంది. అది చీకటి మరియు అణచివేత యుగం అవుతుంది. తరువాత మళ్లీ ప్రవక్తత్వ విధానంలో కొనసాగు ఖిలాఫత్ స్థాపించబడుతుంది."

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) చేసిన ఈ భవిష్యవాణి ప్రకారం, ప్రవక్త (స) అనంతరం ఏర్పడిన ఖిలాఫత్-ఎ-రాషిదా (సన్మార్గ ఖిలాఫత్) కొనసాగినట్లుగానే, హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం గారి కాలంలో కూడ కొనసాగుతుందని మేము విశ్వసిస్తున్నాము.

హజ్రత్ మసీహ్ మౌవూద్ (అలైహిస్సలాం) మరణానంతరం, జమాత్ సభ్యులు హజ్రత్ మౌలానా హకీమ్ నూరుద్దీన్ సాహిబ్ (రజియల్లాహు అన్హు) ను మొదటి ఖలీఫతుల్ మసీహ్‌గా ఎన్నుకున్నారు. వారి మరణానంతరం 1914లో రెండవ ఖిలాఫత్ ఎన్నిక జరిగింది. అందులో హజ్రత్ మిర్జా బషీరుద్దీన్ మహ్మూద్ అహ్మద్ సాహిబ్ (రజియల్లాహు అన్హు) రెండవ ఖలీఫతుల్ మసీహ్‌గా ఎన్నికయ్యారు.

హజ్రత్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాం పరమపదించిన సమయంలో అహ్మదీయా జమాత్ సభ్యుల సంఖ్య సుమారు ఐదు లక్షల వరకు ఉండేదని హుజూర్ అన్వర్ తెలిపారు. ఈరోజు అల్లాహ్ తఆలా కృపవల్ల ప్రపంచంలోని 204 దేశాలలో ఈ సంఖ్య కోట్లకు చేరుకుంది. ఇప్పుడు ఖలీఫా ఎన్నిక కోసం ఒక అధికారిక ఎలక్టోరల్ కాలేజ్ ఉంది. ఇందులో జమాత్ సంస్థలైన అంజుమన్, తహ్‌రీక్-ఎ-జదీద్ అధికార ప్రతినిధులు, సీనియర్ ముబల్లిగ్‌లు, వివిధ దేశాల అమీర్లు మరియు మరికొందరు సభ్యులు ఉంటారు. వీరందరూ ఒకేచోట సమావేశమై ఖలీఫాను ఎన్నుకుంటారు.

1982లో హజ్రత్ మసీహ్ గారి మూడవ ఖలీఫా (రహి) గారు పరమ పదించినప్పుడు, హజ్రత్ మసీహ్ గారి నాలుగవ ఖలీఫా (రహి) గారు రబ్వాలో ఖలీఫాగా ఎన్నుకోబడ్డారు.

1984లో జనరల్ జియా-ఉల్-హక్ ఒక దమనకర ఆర్డినెన్స్ అమలు చేశాడు. దాని ప్రకారం ఇస్లామీయ విశ్వాసాల వ్యక్తీకరణపై కఠిన నిషేధాలు విధించబడ్డాయి మరియు శిక్షలు నిర్ణయించబడ్డాయి. "అస్సలాము అలైకుం" అని పలకడానికే జైలు శిక్ష మరియు జరిమానా విధించబడింది. ఆ పరిస్థితుల్లో హజ్రత్ మసీహ్ గారి నాలుగవ ఖలీపా (రహిమహుల్లాహ్) పాకిస్తాన్ నుండి లండన్‌కు ప్రస్థానం చేశారు (వలస వెళ్ళారు). ఎందుకంటే ఖలీఫా హోదాలో వారు తమ అధికారిక బాధ్యతలను సక్రమంగా నిర్వహించలేకపోయారు మరియు జమాత్‌కు మార్గనిర్దేశం చేయలేకపోయారు.

2003లో లండన్‌లో వారు పరమపదించినప్పుడు, ఐదవ ఖిలాఫత్ ఎన్నిక లండన్‌లోని ఫజల్ మస్జిద్‌లో జరిగింది. "ఫజల్ మస్జిద్" లండన్‌లోని అత్యంత పురాతన మస్జిద్. అందువల్ల 22 ఏప్రిల్ 2003న జరిగిన ఆ ఎన్నికలో నన్ను ఖలీఫాగా ఎన్నుకున్నారు.

తర్వాత జర్నలిస్ట్ ఒక ప్రశ్న అడిగాడు: ప్రజల్లో హజ్రత్ మిర్జా గులాం అహ్మద్ గారు తాను ప్రవక్తనని ప్రకటించుకున్నారని ఒక అభిప్రాయం ఉంది కదా?

దానికి సమాధానంగా హుజూర్ అన్వర్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ ఇలా తెలిపారు: ఈ భవిష్యవాణి స్వయంగా హజ్రత్ ముహమ్మద్ ముస్తఫా సల్లల్లాహు అలైహి వసల్లం కాలం నుంచే ఉంది. ప్రవక్త ఇలా పేర్కొన్నారు: నా సమాజంలో నుండి వచ్చే మసీహ్ అల్లాహ్ ప్రవక్తగా ఉంటాడు.

రాబోయే మసీహ్ హజ్రత్ ఈసా అలైహిస్సలాం అని, ఆయన ఆకాశంలో జీవించి ఉన్నారని మరియు తిరిగి వస్తారని సాధారణ ముస్లింల విశ్వాసం. అలాగే మసీహ్ మరియు మహ్దీ ఇద్దరూ వేర్వేరు వ్యక్తులని వారు నమ్ముతారు. మసీహ్ ఆకాశం నుండి దిగివస్తారని, మహ్దీ ముస్లిం సమాజంలో నుండి వస్తారని. వీరిద్దరూ కలిసి యుద్ధాలు చేస్తారని, శిలువలను విరుస్తారు మరియు పందులను చంపుతారని విశ్వసించుతారు.

**(11వ పేజీలో చదువుము)**

Printed & Published by: Jameel Ahmed Nasir on behalf of Nigran Board of Badar. Name of Owner: Nigran Board of Badar. And printed at Fazle-Umar Printing Press. Harchowal Road, Qadian, Distt. Gurdaspur-143516, Punjab. And published at office of Weekly Badar Mohallah - Ahmadiyya, Qadian Distt. Gsp-143516, Punjab. India. Editor:Syed Rasool Niyaz